


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 140 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం బుధవారం 1 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 140 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM WED 1 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఇది లక్షద్వీప్ కాదు... వైజాగ్!

### ఆసక్తికర వీడియో పంచుకున్న మంత్రి నారా లోకేశ్



- ఏపీ పర్యాటక రంగ ప్రమోషన్‌పై మంత్రి లోకేశ్ దృష్టి
- సోషల్ మీడియా వేదికగా ఆకట్టుకుంటున్న ప్రచార వీడియో
- ఇది లక్షద్వీప్ కాదు వైజాగ్ అంటూ ఆసక్తికర పోలికలు
- ప్రకృతి, ఆధ్యాత్మికత, అవకాశాల సంగమం ఏపీ అని ట్వీట్

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ అభివృద్ధిపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా సోషల్ మీడియా వేదికగా ఒక ఆసక్తికరమైన ప్రచార వీడియోను ఆయన పంచుకున్నారు.

- మిగతా2లో

## క్వాంటం అప్లికేషన్లతో ఆంధ్రప్రదేశ్ కే

# తొలి ప్రయోజనాలు


- 'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్‌తో క్వాంటం హార్డ్ వేర్ ఉత్పత్తి లక్ష్యం
- ఏప్రిల్ 14న అమరావతిలో దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ ప్రారంభం
- 2030 నాటికి గ్లోబల్ క్వాంటం హబ్?గా ఏపీని తీర్చిదిద్దేలా ప్రణాళిక
- క్వాంటం హార్డ్ వేర్ తయారీ ఎకోసిస్టంపై సీఎం చంద్రబాబు కీలక రౌండ్ టేబుల్ సమావేశం




పెన్ పవర్ డెస్క్:క్వాంటం కంప్యూటింగ్ అప్లికేషన్ల ద్వారా లభించే ప్రయోజనాలను దేశంలోనే తొలిగా అందుకునేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తు సాంకేతికత అయిన క్వాంటం కంప్యూటింగ్‌లో 'ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్'ను అందిపుచ్చుకోవడం ద్వారా రాష్ట్రానికి అపార అవకాశాలు లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో 'అమరావతి క్వాంటం వ్యాలీ - క్వాంటం హార్డ్ వేర్ మాన్యుఫాక్చరింగ్ ఎకోసిస్టమ్' అనే అంశంపై జరిగిన ఉన్నత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్న అమరావతి క్వాంటం వ్యాలీ (ఏక్యూవీ), దేశానికే ప్రగతి ప్రేరకంగా నిలుస్తుందని అన్నారు.

ఈ కీలక సమావేశానికి నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, స్టేట్ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్, ఐబీఎం డైరెక్టర్ అమిత్ సింఘీతో పాటు సీడాక్, సీడాట్, డీఆర్‌డీవో, బార్క్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. మూడు దశాబ్దాల క్రితం ఐటీని అందిపుచ్చుకుని హైదరాబాద్‌ను నాలెడ్జ్ ఎకానమీగా మార్చిన స్ఫూర్తితో, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీని ఏపీ అభివృద్ధికి చోదకశక్తిగా మలుస్తామని చంద్రబాబు వివరించారు. గతంలో ఐటీ నిపుణుల కోసం ఇంజనీరింగ్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసినట్లే,

- మిగతా2లో



## ఏపీ రాజధానిగా అమరావతికి

# చట్టబద్ధత...

### నేడు లోక్‌సభలో కీలక బిల్లు


- ఏపీ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధ హోదా
- బుధవారం నాడు లోక్‌సభలో ఏపీ పునర్‌వ్యవస్థీకరణ సవరణ బిల్లు
- విభజన చట్టంలోని సెక్షన్ 5కు సవరణ చేయనున్న కేంద్రం
- ఇప్పటికే ఏపీ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం
- జూన్ 2, 2024 నుంచి సవరణ అమల్లోకి వచ్చేలా నిబంధన

- మిగతా2లో

## ఏపీలో చేనేతలకు 'పవర్' గిఫ్ట్... నేటి నుంచే!

- చేనేత మగ్గాలకు 200, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్
- ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పథకం అమలు
- లక్షకు పైగా చేనేత కుటుంబాలకు ప్రత్యక్షంగా లబ్ధి
- పథకం కోసం ఏటా రూ.150 కోట్లు వెచ్చించనున్న ప్రభుత్వం
- ఎన్నికల హామీని నెరవేర్చిన ఎన్డీయే ప్రభుత్వం

- మిగతా2లో



## బందరులో ఒక బఫూన్ ఉన్నాడు



- మంగళగిరి టీడీపీ ఆఫీసులో మంత్రి కొల్లు రవీంద్ర మీడియా సమావేశం
- వైసీపీ నేత పేర్ని నానిపై తీవ్ర విమర్శలు
- మడ అడవులు ఆక్రమించి పేర్ని నాని అక్రమంగా చెరువులు తవ్వారన్న ఆరోపణ
- తప్పు చేసిన వారిని ఎవరినీ వదిలిపెట్టబోమని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు వెల్లడి

- మిగతా2లో

### పవన్ కల్యాణ్ శాఖకు జాతీయ స్థాయిలో అవార్డుల పంట..

## 24వ స్థానం నుంచి అగ్రస్థానానికి ఏపీ



- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖకు 5 జాతీయ అవార్డులు
- రెండు విభాగాల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్
- గత ప్రభుత్వ హయాంలో 24వ స్థానం నుంచి మొదటి స్థానానికి ఎగబాకిన ఏపీ
- పల్లెపండుగ, పల్లె వెలుగు వంటి కార్యక్రమాలతో మెరుగైన పనితీరు
- ఈ పురస్కారాలను ప్రకటించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ

- మిగతా2లో

## కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారు

- ప్రపంచ సవాళ్ల మధ్య భారత్ నిలకడగా ఉందని వ్యాఖ్య
- కాంగ్రెస్ వదంతులు వ్యాపింపజేస్తోందని తీవ్ర విమర్శలు
- గుజరాత్‌లోని డీసా ఎయిర్‌బేస్‌ను ప్రారంభించిన ప్రధాని
- ఈ ప్రాజెక్టు ఆలస్యానికి కాంగ్రెసే కారణమని ఆరోపణ
- దేశ ఐక్యతకు పాటుపడాలని ప్రజలకు పిలుపు



పెన్ పవర్ డెస్క్:ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన, భౌగోళిక రాజకీయ సవాళ్లు నెలకొన్నప్పటికీ, భారతదేశం స్థిరంగా ఉందని స్పష్టం చేశారు. మంగళవారం గుజరాత్‌లోని వావ్-థరాడ్‌లో రూ.19,800 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ఐక్యతను దెబ్బతీస్తూ, కాంగ్రెస్ వదంతులను ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారని మండిపడ్డారు.పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోందని మోదీ అన్నారు. "ప్రపంచంలోని ఎన్నో దేశాలు

- మిగతా2లో

## అమెరికా సాయం చేయదు.. మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

### మిత్రదేశాలపై ట్రంప్ ఫైర్



- ఇరాన్‌పై దాడులకు సహకరించని మిత్రదేశాలపై ట్రంప్ ఆగ్రహం
- మీ ఆయిల్‌ను మీరే తెచ్చుకోండి అంటూ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్
- అమెరికా నుంచి కొనుగోలు చేయండి లేదా బలవంతంగా తెచ్చుకోండి అని సూచన
- హార్మూజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించడంతో పెరిగిన చమురు ధరలు

- మిగతా2లో

## ఒక్కడు... 27 బైకులు చోరీ చేశాడు!

- ప్రకాశం జిల్లాలో ఘరానా దొంగ అరెస్ట్
- 27 బైకులు చోరీ చేసిన వైనం
- చెడు వ్యసనాల కోసమే దొంగతనాలు చేస్తున్నట్లు వెల్లడి
- నిందితుడి నుంచి రూ.10 లక్షల విలువైన బైకులు స్వాధీనం
- అరెస్ట్ సమయంలో కిలోకు పైగా గంజాయి కూడా పట్టివేత

- మిగతా2లో



పెన్ పవర్ డెస్క్:ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా 27 బైకులను ఒక్కడే చోరీ చేశాడు. చెడు వ్యసనాలకు బానిసై, సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగగా మారిన ఓ వ్యక్తిని ప్రకాశం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.10 లక్షల విలువైన 27 మోటార్‌సైకిళ్లను, కిలోకు పైగా

## మా పంటలు ఎండిపోతుంటే అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తారా?

### ఏపీ ప్రభుత్వంపై మంత్రి జూపల్లి ఆగ్రహం

- శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గినా ఏపీ విద్యుత్ ఉత్పత్తి చేస్తోందన్న జూపల్లి
- ఏపీ ప్రభుత్వం కనీసం తాగడానికి నీళ్లు కూడా లేకుండా చేస్తోందని ఆవేదన
- రైతుల హక్కులు కాలరాస్తే ఊరుకోబోమని హెచ్చరిక

- మిగతా2లో



## తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు

- ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని వెల్లడి
- గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ

- మిగతా2లో



## నేటి నుంచి తెలంగాణలో చికెన్ దుకాణాలు బంద్..

- పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచాలని చికెన్ షాపు యజమానుల డిమాండ్
- ఇటీవల గతంలో కంటే మార్జిన్‌లు తగ్గించారని ఆవేదన
- కిలో చికెన్‌పై రూ.30 మార్జిన్ ఇవ్వాలని డిమాండ్

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

# వంట గ్యాస్ సిలిండర్ల కొరత తీరేనా?

మారుమూల పల్లెల నుండి మొదలుకొని పేరు మోసిన పట్టణాల్లో సైతం గ్యాస్ సిలిండర్ల వాడకం విరివిరిగా కొనసాగుతుంది. కానీ ఇప్పుడున్న విపత్కర పరిస్థితుల్లో గ్యాస్ సిలిండర్ల వాడకదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. గ్యాస్ వినియోదారుల అవస్థలు అంత పట్టకుండా ఉండే పరిస్థితులు నేడు దాపరించాయి. ప్రస్తుతం ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో యుద్ధాలు జరుగుతుండడమే వంటగ్యాస్ కొరతకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఈ యుద్ధాల వల్ల గ్యాస్ ఉత్పత్తుల్లో, అంతర్జాతీయ సరఫరా ప్రభావితం అవుతుంది. రష్యా , ఉక్రెయిన్, ఇజ్రాయెల్ వంటి దేశాల నుండి ఖఉ, నాచురల్ గ్యాస్, కొద్దిపాటి పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా క్రమంగా తగ్గిపోతుంది. దీనివల్ల విదేశీ మార్కెట్లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సరఫరా తగ్గుముఖం పట్టడం వల్ల గ్యాస్ సిలిండర్ డిమాండ్పై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుంది. భారతదేశంలో ఒఖఉ గ్యాస్ దిగుమతి ఆధారిత వనరుగా ఉంది. తద్వారా కొన్ని దేశాల నుండి ఒఖఉ గ్యాస్ సరఫరా నిలిచిపోయే ఆస్కారం ఉంది. దీనివల్ల ఒఖఉ గ్యాస్ కొరత గణనీయంగా పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం సామాన్య కుటుంబాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజానీకం గ్యాస్ సిలిండర్ల సరఫరా పూర్తిస్థాయిలో లేక సతమతమవుతున్నారు. వృద్ధులు, నిరాక్షరాస్యులు ఎలా గ్యాస్ బుక్ చేసుకోవడం తెలియని పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. స్థానిక ఒఖఉ డీలర్ల వద్ద నిల్వలు తగ్గడం వల్ల ఫోన్ లేదా ఆన్లైన్ బుకింగ్ ద్వారా గ్యాస్ సిలిండర్లు అందుబాటులోకి రావడం చాలా కష్టంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో కనీసం బుక్ కావడం కూడా ఒక సవాలుగా దాపరించింది. టోల్ ఫ్రీ నెంబర్, ఐవిఆర్ఎస్, యాప్, ఇలా ఎన్నో రకాలుగా ఉన్న ప్రత్యామ్నాయాల ద్వారా కూడా ప్రయత్నం చేసినా బుక్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో కొరత అధికంగా ఉంది అనడంలో ఆశ్చర్యం లేదు. ఇలాంటి దయనీయమైన పరిస్థితుల్లో చాలామంది ప్రజలు మళ్ళీ పూర్వ కాలపు విధానాల ఏర్పాట్ల వైపు మొగ్గుచూపుతున్నారు. వంట చెరుకు, గోబర్ గ్యాస్, విద్యుత్ వాడకపు సాధనాలను వినియోగిస్తూ వంట చేసుకుంటున్నారు. భవిష్యత్తులో ఒఖఉ మార్కెట్పై అనూహ్య ప్రభావాలు సంభవించే అవకాశం లేకపోలేదు. ముఖ్యంగా ఇలానే యుద్ధం కొనసాగితే ధరలు అనియంత్రితంగా పెరిగే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో డీలర్ల వద్ద స్టాక్ తక్కువ ఉండడం వలన గ్యాస్ సిలిండర్ల ధర విషయంలో చేతివాటం చూపిస్తున్నారు. వాణిజ్య కేంద్రాలైన హోటల్, రెస్టారెంట్లు, హాస్టల్స్ యాజమాన్యాలతో కుమ్మక్కై గ్యాస్ సిలిండర్లను వారికి నచ్చిన ధరలతో సరఫరా చేస్తూ గృహ వినియోగదారులకు మొండి చేయి చూపిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు చాలా చోట్ల జరుగుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఇలాంటి విషయాల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాలను పర్యవేక్షిస్తూ స్టాక్ రికార్డులను పరిశీలించాలి. డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాల వద్ద సామాన్య ప్రజలు తమ పనులను వదులుకొని గంటల తరబడి వేచి ఉండి ప్రాధేయపడిన వారికి సరైన సమాధానం చెప్పే నాధుడు కరువయ్యాడు. ప్రభుత్వ అధికారులు వినియోగదారుల పరిస్థితులను వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని కార్యాచరణ చేయాల్సిన అవసరం ఉంది. వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు నెంబర్లపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

## కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారు

- మొదటి పేజి తరువాయి

అస్థిరతను ఎదుర్కొంటున్నాయి. డీజిల్, పెట్రోల్, గ్యాస్ సమస్యలతో సతమతమవుతున్నాయి. అయితే, మన విజయవంతమైన విదేశాంగ విధానం, ప్రజల ఐక్యత వల్ల భారత్ ఈ పరిస్థితులను అదుపులో ఉంచగలిగింది" అని ఆయన వివరించారు. చిన్న దేశాల నుంచి అగ్రరాజ్యాల వరకు ఇంధన ధరలు 10 నుంచి 25 శాతం పెరిగాయని, కానీ భారత్ మాత్రం ఆ భారాన్ని ప్రజలపై పడనీయడం లేదని తెలిపారు. ఈ వాస్తవాలను కాంగ్రెస్ చూడలేకపోతోందని మోదీ విమర్శించారు. "దేశానికి ఐక్యత అవసరమైన ఈ సమయంలో కొందరు రాజకీయాలు చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ ముందుంది. ధైర్యం చెప్పాల్సిన చోట భయాన్ని, వదంతులను వ్యాపింపజేస్తున్నా రు. రాజకీయ రాబందుల్లా దేశంలో గందరగోళం కోసం ఎదురుచూస్తూ, ఎన్నికల లబ్ధి పొందాలని చూస్తున్నారు" అని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ఇంధన ధరల విషయంలోనూ ప్రజలను క్యూలలో నిలబెట్టి లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా డీసా ఎయిర్బేస్ను ప్రారంభించడంపై మోదీ సంతోషం వ్యక్తం చేశారు. "ఈ ఎయిర్బేస్ అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం 130 కిలోమీటర్ల దూరంలో ఉంది. దేశ భద్రతకు ఇది చాలా కీలకం" అని ఆయన పేర్కొన్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టుకు భూసేకరణ జరిగిందని గుర్తుచేశారు. "అప్పుడు ఢిల్లీలో అధికారంలో ఉన్నవారికి గుజరాత్పై ఎందుకో ద్వేషం. ఏళ్ల తరబడి ఫైళ్లను తొక్కిపెట్టి ప్రాజెక్టును అడ్డుకున్నారు. మీరు నన్ను ఢిల్లీకి పంపిన తర్వాత ఆ ఫైళ్లను బయటకు తీసి, ఈ ఎయిర్బేస్ను పూర్తి చేశాను" అని మోదీ తెలిపారు. ఈ ఆలస్యానికి కాంగ్రెస్ వైఖరే కారణమని, దేశ భద్రత విషయంలో వారి ప్రవర్తనను జాతి ఎప్పటికీ క్షమించదని అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఏఐ సమ్మిట్లో ప్రపంచ దేశాలు భారత్ను ప్రశంసిస్తుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం దేశ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూశారని మోదీ ఆరోపించారు. భారత్కు వ్యతిరేకంగా మాట్లాడే శక్తుల మాదిరిగా కాంగ్రెస్ మాట్లాడుతోందని విమర్శించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో చూపిన ఐక్యతను ఇప్పుడు కూడా ప్రదర్శించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఉత్తర గుజరాత్ అభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, దేశీయ, అంతర్జాతీయ సవాళ్లను భారత్ ఎలా ఎదుర్కొంటుందో చెప్పడానికి నిదర్శనమని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

## ఇది లక్షద్వీప్ కాదు... వైజాగ్!

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త ఊపు తెచ్చే ఈ వీడియో ఇప్పుడు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రచార వీడియోలో ఏపీలోని పలు సుందర ప్రదేశాలను దేశంలోని ఇతర ప్రముఖ పర్యాటక కేంద్రాలతో పోల్చి చూపించారు. "ఇది లక్షద్వీప్ కాదు వైజాగ్... సిక్కిం కాదు కైలాసగిరి... సుందర్ బన్స్ కాదు కోరింగ... తమిళనాడు కాదు సింహాచలం... గోవాలోని బాగా బీచ్ కాదు రుషికొండ బీచ్... ఇది కేరళ కాదు కోనసీమ... ఇది ఆంధ్రప్రదేశ్" అంటూ సాగే ఈ వీడియో రాష్ట్రంలోని ప్రకృతి రమణీయతను కళ్లకు కడుతోంది. ఈ వీడియోతో పాటు లోకేశ్ ఒక సందేశాన్ని కూడా పోస్ట్ చేశారు. "పవిత్ర ఆలయాల్లోని మంత్రోచ్ఛారణల నుంచి అంతులేని సముద్ర తీరం వరకు, కాలుష్యానికి దూరంగా ఉన్న కొండల అందాల వరకు ఆంధ్రప్రదేశ్ ఆత్మకు ఓ గొప్ప ప్రయాణం లాంటిది. ఇక్కడ ప్రకృతి, ఆధ్యాత్మికత, అవకాశాలు అన్నీ ఒకేచోట సంగమిస్తాయి. రండి, ఆంధ్రప్రదేశ్ మ్యాజిక్ను అనుభూతి చెందండి" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

# ఏపీలో చేనేతలకు 'పవర్' గిఫ్ట్... నేటి నుంచే!

ఆంధ్రప్రదేశ్లోని చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక కానుక అందించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ పథకం ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానుంది. దీని కింద చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్లూమ్లకు (మరమగ్గాలకు) 500 యూనిట్ల వరకు విద్యుత్ను ఉచితంగా సరఫరా చేయనున్నారు. విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించి, సంక్షోభంలో ఉన్న చేనేత వృత్తికి అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,04,488 చేనేత కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. వీరిలో సుమారు 93,000 చేనేత మగ్గాల కుటుంబాలు, 11,488 పవర్లూమ్ కుటుంబాలు ఉన్నాయి. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ.150 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ రాయితీ ద్వారా ప్రతి చేనేత కార్మికుడి కుటుంబానికి ఏడాదికి రూ.8,640 ఆదా కానుండగా, ఒక్కో పవర్లూమ్ యూనిట్కు ఏటా రూ.21,600 వరకు ఆర్థిక వెసులుబాటు లభిస్తుంది. ముడిసరుకు, రంగుల అద్దకం, నేత పనులకు విద్యుత్ అత్యవసరం కావడంతో, ఈ ఉచిత సరఫరా వారి ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించనుంది.

ఉచిత విద్యుత్ పథకంతో పాటు, చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం మరిన్ని కీలక చర్యలు చేపట్టింది. అధికారంలోకి వచ్చిన వెంటనే నేతన్నలకు ఇచ్చే పెన్షన్ను రూ.4 వేలకు పెంచింది. దీంతో పాటు రూ.5 కోట్ల విలువైన థ్రిఫ్ట్ ఫండ్ నిధులను సహకార సంఘాలకు విడుదల చేసింది. ఆధునిక యంత్రాల కొనుగోలుపై 90 శాతం రాయితీ, ముడిసరుకులపై 15 శాతం సబ్సిడీ వంటి ప్రోత్సాహకాలను అందిస్తోంది. చిన్న తరహా క్లస్టర్ల అభివృద్ధికి రూ.10.44 కోట్లు కేటాయించింది. అంతేకాకుండా, చేనేత ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేర్చేందుకు అమెజాన్, ఫ్లిప్కార్ట్ వంటి ఆన్లైన్ వేదికలతో మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తోంది. తాజాగా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయడం ద్వారా చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది.

## ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత...

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకోనుంది. 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన (సవరణ) బిల్లు 2026'ను (ఏప్రిల్ 1) బుధవారం లోక్సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లు ద్వారా 2014 నాటి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి సవరణ చేసి, రాష్ట్ర నూతన రాజధానిగా 'అమరావతి' పేరును అధికారికంగా చేర్చనున్నారు. ఈ బిల్లు ద్వారా పునర్విభజన చట్టంలోని సెక్షన్ 5, సబ్-సెక్షన్ (2)కు సవరణ చేయనున్నారు. ప్రస్తుతం ఈ సెక్షన్లో ఉన్న... 'రాష్ట్రానికి ఒక కొత్త రాజధాని ఉంటుంది' (and there shall be a new capital) అనే వాక్యం స్థానంలో 'అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది' (and Amaravati shall be the new capital)... అని చేర్చనున్నారు. అంతేకాకుండా, 'అమరావతి' అనే పదంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఙూాజ=ణూ) చట్టం, 2014 ప్రకారం నోటిఫై చేసిన రాజధాని నగర ప్రాంతాలు కూడా కలిసి ఉంటాయని ఈ సవరణలో స్పష్టంగా వివరించనున్నారు. ఈ సవరణ జూన్ 2, 2024 నుంచే అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించనున్నట్లు బిల్లులో పేర్కొనడం గమనార్హం. రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని ఏకైక రాజధానిగా నిలబెట్టేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా, మార్చి 28న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఒక తీర్మానాన్ని ఆమోదించింది. పునర్విభజన చట్టంలోని సెక్షన్ 5ను సవరించి 'అమరావతి' పేరును అధికారికంగా చేర్చాలని ఆ తీర్మానంలో కేంద్రాన్ని కోరింది. 2022 మార్చి 3న హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లోని సలహా మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లు అసెంబ్లీ తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీలో ఆమోదించిన ఈ తీర్మానాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు.. రాజ్యసభ ఛైర్మన్, లోక్సభ స్పీకర్, కేంద్ర హోంమంత్రి, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు పంపించారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఈ బిల్లును తీసుకురానుండడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సవరణ బిల్లుతో ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయంలో నెలకొన్న సందిగ్ధతకు చట్టపరంగా తెరపడుతుందని, అమరావతికి తిరుగులేని చట్టబద్ధ హోదా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

### పవన్ కల్యాణ్ శాఖకు జాతీయ స్థాయిలో అవార్డుల పంట..

## 24వ స్థానం నుంచి అగ్రస్థానానికి ఏపీ

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వం వహిస్తున్న ఈ శాఖకు ఏకంగా ఐదు జాతీయ పురస్కారాలు లభించాయి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, సేవల విస్తరణలో కనబరిచిన అత్యుత్తమ పనితీరుకు గానూ కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఈ అవార్డులను ప్రకటించింది. వివరాల్లోకి వెళితే... రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్, జల్ సంచయ్-జన్ భాగీదారి అనే రెండు కీలక విభాగాల్లో ఏపీ దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. మరో విభాగంలో ద్వితీయ స్థానం, ఇంకో రెండు విభాగాల్లో తృతీయ స్థానం దక్కించుకుని మొత్తం ఐదు అవార్డులను కైవసం చేసుకుంది. గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడం, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని ప్రోత్సహించే రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్లో ఏపీ పనితీరు విశేషంగా మెరుగుపడింది. గత ప్రభుత్వ హయాంలో ఇదే విభాగంలో 24వ స్థానంలో ఉన్న రాష్ట్రం, ఇప్పుడు దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. అలాగే, తక్కువ ఖర్చుతో వర్షపు నీటిని నిల్వ చేసే పద్ధతులను ప్రోత్సహించే 'జల్ సంచయ్ - జన్ భాగీదారీ' కార్యక్రమంలోనూ ఏపీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణం,

సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సౌకర్యాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే 'పల్లెపండుగ 1.0', 'పల్లెపండుగ 2.0' వంటి కార్యక్రమాలను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో గ్రామసభలు నిర్వహించి, ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.

గ్రామసభలలో వచ్చిన విజ్ఞప్తుల ఆధారంగా 'పల్లెవెలుగు' కార్యక్రమాన్ని చేపట్టి గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే శాఖ పనితీరు గణనీయంగా మెరుగుపడి, జాతీయ స్థాయిలో ఈ పురస్కారాలు దక్కడం విశేషం.

## బందరులో ఒక బఫూన్ ఉన్నాడు

రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నానిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత జగన్తో పాటు పేర్ని నానిని లక్ష్యంగా చేసుకుని ఆయన తీవ్ర విమర్శలు చేశారు. "బందరులో ఒక బఫూన్ ఉన్నాడు. షాడోలను అడ్డుపెట్టుకుని అక్రమంగా చెరువులు తవ్వించాడు. మడ అడవులను సైతం ఆక్రమించి చెరువులుగా మార్చేశాడు" అని పేర్ని నానిని ఉద్దేశించి కొల్లు రవీంద్ర ఆరోపించారు. అధికారులను బ్లాక్ మెయిల్ చేసి భూములు దోచుకోవడానికి నాని ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో ఇలాంటి అక్రమాలకు తావులేదని స్పష్టం చేశారు. తప్పు చేస్తే ఎవరినీ ఉపేక్షించవద్దని ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు.

## క్వాంటం అప్లికేషన్లతో ఆంధ్రప్రదేశ్ కే

# తొలి ప్రయోజనాలు

- మొదటి పేజి తరువాయి

ఇప్పుడు క్వాంటం నిపుణులను తీర్చిదిద్దేందుకు వైసర్, ఐబీఎం వంటి సంస్థల భాగస్వామ్యంతో యువతకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

**'మేడ్ ఇన్ అమరావతి' క్వాంటం హార్డ్ వేర్ లక్ష్యం**

రాబోయే రెండేళ్లలో 'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్తో క్వాంటం కంప్యూటింగ్ పరికరాలను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. క్వాంటం హార్డ్ వేర్, క్రయోజనిక్స్, అల్గారిథమ్స్ వంటివాటిని దిగుమతి చేసుకోకుండా, అమరావతి క్వాంటం వ్యాలీలోనే దేశీయంగా ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. 2030 నాటికి ప్రపంచంలోని 5 గ్లోబల్ క్వాంటం హబ్స్లో ఒకటిగా ఏపీని తీర్చిదిద్దాలని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, హార్డ్ వేర్ ఎకోసిస్టంను ఏక్యూవీలో ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న 8 టవర్లలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్తో పాటు స్టార్టప్లు, పరిశోధనలకు అవకాశం కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ ప్రణాళికలో భాగంగా, దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ను ఏప్రిల్ 14వ తేదీన అమరావతిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు క్యూబిట్ ఫోర్స్ సంస్థ డైరెక్టర్ వెంకట్ సుబ్రమణ్యన్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సతీష్ కుమార్ ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు టెస్టింగ్ కోసం ఈ కంప్యూటర్ అందుబాటులో ఉంటుందని వారు వివరించారు.

క్వాంటం టెక్నాలజీతో అమరావతి భవిష్యత్ నగరంగా, అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా మారుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బృహత్తర లక్ష్య సాధనకు అవసరమైన సాంకేతికత, భాగస్వామ్యం అందించాలని జాతీయ క్వాంటం మిషన్ను ఆయన కోరారు.

## తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు

తెలంగాణ రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు, రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు, రేపు పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, అసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రేపు కామారెడ్డి, సంగారెడ్డి,ద

మెదక్, వికారాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది.

## అమెరికా సాయం చేయదు.. మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రదేశాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్పై సైనిక చర్యలో అమెరికాకు సహకరించని దేశాలు, తమకు కావాల్సిన చమురును తామే తెచ్చుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ప్లాట్ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ పెట్టారు. "ఇరాన్ను దెబ్బతీసే చర్యల్లో పాల్గొనడానికి నిరాకరించిన యునైటెడ్ కింగ్డమ్ వంటి దేశాలకు నాదొక సూచన. మీకు రెండు మార్గాలున్నాయి. ఒకటి, మా దగ్గర పుష్కలంగా ఉన్న చమురును కొనుగోలు చేయండి. రెండు, కాస్త ధైర్యం తెచ్చుకుని హర్మూజ్ జలసంధికి వెళ్లి, మీకు కావాల్సిన చమురును మీరే తెచ్చుకోండి" అని ట్రంప్ తన పోస్ట్లో పేర్కొన్నారు. అంతేగాక మిత్రదేశాలు ఇకపై తమ కోసం తాము పోరాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. "అమెరికా మీకు సాయం చేయడానికి రాదు. మాకు అవసరమైనప్పుడు మీరు ఎలాగైతే దూరంగా ఉన్నారో, మేమూ అలాగే ఉంటాం. ఇరాన్ను మేము ఇప్పటికే దెబ్బతీశాం. కష్టమైన పని పూర్తయింది. ఇక వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి" అని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి నెల రోజులు దాటినా, ఇరాన్ ఇప్పటికీ హర్మూజ్ జలసంధిపై తన పట్టును కొనసాగిస్తోంది. ప్రపంచంలోని ఐదో వంతు చమురు రవాణా ఈ జలసంధి గుండానే జరుగుతుంది. ఇరాన్ దిగ్బంధనం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇది ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుదిపేయడంతో పాటు అనేక నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమైంది.

## నేటి నుంచి తెలంగాణలో చికెన్ దుకాణాలు బంద్..

తెలంగాణ రాష్ట్రంలో రేపటి నుంచి చికెన్ దుకాణాలు బంద్ కానున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్లు పెంచే వరకు నిరవధిక బంద్ పాటిస్తామని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. గతంలో కంటే మార్జిన్ ఇప్పుడు తక్కువగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పౌల్ట్రీ వాళు రిటైల్ దుకాణాలకు కిలోకు రూ.26 మార్జిన్ ఇచ్చేవారని, గత ఇరవై ఏళుగా ఇదే మార్జిన్ ఇస్తున్నారని, ఇటీవల ఈ మార్జిన్ రూ.16కు తగ్గించారని దుకాణ యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. కేజీ చికెన్ మార్జిన్ రూ.30 ఇవ్వాలని ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అందుకే మార్జిన్ పెంచే వరకు నిరవధిక బంద్కు పిలుపునిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం చికెన్ విక్రయాలపై వస్తున్న లాభాలు తక్కువగా ఉండటంతో షాపులు నిర్వహించడం కష్టంగా మారినట్లు అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. తక్కువ మార్జిన్ వల్ల వ్యాపారుల జీవనోపాధి సవాల్గా మారిందని అంటున్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగుతుందని తెలిపారు.

### మా పంటలు ఎండిపోతుంటే అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తారా?

శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గినా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే మీరు విద్యుత్ ఉత్పత్తి ఎలా చేస్తారని ఏపీ సర్కారును ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వం కనీసం తాగడానికి కూడా నీళ్లు లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జలాశయంలో నీటి మట్టం తక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని జూపల్లి గుర్తు చేశారు. "ఉమ్మడి రాష్ట్రంలో 2012లో కూడా ఇలాగే అక్రమంగా నీటిని తరలించుకుపోయారు. నాడు మేము ధర్నా చేసి, హైకోర్టును ఆశ్రయిస్తే కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఇప్పుడు మళ్లీ అదే పంథాను ఏపీ ప్రభుత్వం అనుసరిస్తోంది" అని ఆయన విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో తెలంగాణకు 64 శాతం వాటా ఉందని, రైతుల హక్కులను కాలరాస్తే ఊరుకోబోమని జూపల్లి హెచ్చరించారు. "నీటి కేటాయింపులపై స్పష్టమైన జీవోలు ఉన్నాయి. సమాచారం అందలేదని చెప్పడానికి మీరేమైనా చదువురాని వాళ్లా?" అని ఆయన ఏపీ పాలకులను సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసిందని, ఏపీ కూడా చట్టప్రకారం నడుచుకోవాలని హితవు పలికారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీశైలంలో నీటి దోపిడీని పట్టించుకోకపోవడం వల్లే, ఏపీ ప్రభుత్వం ఇప్పుడు అలుసుగా తీసుకుంటోందని జూపల్లి ధ్వజమెత్తారు. ఇప్పటికైనా అక్రమంగా నీటిని తరలించడం ఆపకపోతే.. రైతాంగం, ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ సమష్టిగా పోరాటం చేసి తమ హక్కులను కాపాడుకుంటామని ఆయన గట్టి వార్నింగ్ ఇచ్చారు. నీటి వాటాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు.

### ఒక్కడు... 27 బైకులు చోరీ చేశాడు!

- మొదటి పేజి తరువాయి

గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వివరాల్లోకి వెళితే, సోమవారం మధ్యాహ్నం ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు తన సిబ్బందితో కలిసి మామిడిపాలెం సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామానికి చెందిన అద్దేటి ఏడుకొండలు (35) అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని ఆపి తనిఖీ చేయగా, దొంగిలించిన బైక్తో పాటు 1.175 కిలోల గంజాయి లభించింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజాలు బయటపడ్డాయి. చెడు వ్యసనాలకు డబ్బు అవసరం కావడంతో బైక్ దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నట్లు ఏడుకొండలు అంగీకరించాడు. ఒంగోలు, మద్దిపాడు, అద్దంకి, వినుకొండ, గుంటూరు, నరసరావుపేట, జి.కొండూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 27 బైకులు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. అతని సమాచారం మేరకు పోలీసులు ఆయా బైకులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.12 వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితుడిపై గతంలోనూ ఒంగోలు, గుంటూరులో పలు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, సీఐ నాగరాజుతో పాటు ప్రత్యేక బృందంలోని సిబ్బందిని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, పక్కా ప్రణాళికతో నిందితుడిని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

## దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలు పంపిణీ

**కొవ్వూరు, పెన్ పవర్, మార్చి 31:**దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కారింగుల సీతా మహాలక్ష్మి జ్ఞాపకార్థముగా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రాజమండ్రి బొమ్మూరు ప్రాంతంలోని రూతు ఓల్డ్ ఏజ్ హోమ్ కి, గుడ్ కేర్ వృద్ధాశ్రమానికి భోజనాలు, చీరలు పంపిణీ చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ టీమ్ సభ్యులు ప్రత్తిపాటి నాగరాజు, ప్రకాష్ లు తదితరులు పాల్గొన్నారు.



పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## క్షేత్ర స్థాయి పరిశీలనతో రెవెన్యూ సమస్యలను పరిష్కారించాలి

- పెండింగ్ అర్జీలపై సమగ్ర సమీక్ష
- కలెక్టర్ కీర్తి చేకూరి




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 31:**జిల్లాలో రీ సర్వే, రెవెన్యూ సమస్యల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి, హేతుబద్ధమైన ఉత్తర్వులు జారీ అంశాన్ని ఖచ్చితంగా ధృవీకరించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. మంగళవారం అమరావతి నుండి సిసిఎల్ఏ కమిషనర్ జి. జయలక్ష్మి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. స్థానిక కలెక్టరేట్ నుండి కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, డిఆర్వో టి. సీతారామ మూర్తి, ఆర్డీవోలు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 22 ఎ, రీ సర్వే, పి పి బి పంపిణీ, మ్యూటేషన్స్, జీరో ఖాతాలు, రెవెన్యూ క్లినిక్, పి జి ఆర్ ఎస్, కుల సంబంధిత సుమోటో, పాత పత్రాల స్కానింగ్ తదితర అంశాలపై పెండింగ్ అర్జీల స్థితిని కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ లు సమగ్రంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి రెవెన్యూ డివిజనల్ అధికారులు వారానికి రెండు, మూడు రోజులు క్షేత్ర స్థాయిలో పర్యటిం చాలన్నారు. గ్రామ స్థాయిలో పెండింగ్‌లో రీ సర్వే , అనుబంధ రికార్డులను ప్రత్యక్షంగా పరిశీలించి, నిజ నిర్ధారణ చేయడం ముఖ్యమన్నారు. ప్రభుత్వం సిసిఎల్ఏ కమిషనర్ నుండి గ్రామ స్థాయి వరకు అధికారుల పనితీరును సమగ్రంగా విశ్లేషిస్తుందన్నారు.

విధులలో నిర్లక్ష్యం వహించే అధికారులకు చార్జ్ మెమోలు జారీ బాధ్యత ఆర్డీవోలుకు అప్పగించారన్నారు. క్షేత్ర స్థాయి తనిఖీలు ఆకస్మికంగా నిర్వహించవచ్చని కలెక్టర్ తెలిపారు. మంగళవారం, గురువారం, శనివారం క్షేత్ర స్థాయి పర్యటనలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాల జారీ, రీ సర్వేలో ఆధార్ అప్‌డేషన్, మొబైల్ నెంబర్ నమోదు, ఈ-కేవైసీ వంటి అంశాలను పూర్తి చేయాలన్నారు. మండలాల వారీగా పెండింగ్ ఫైల్స్ మండల అధికారులనీ సిబ్బంది నీ పూర్తి రికార్డులతో జాయింట్ కలెక్టర్ సమక్షంలో సమస్యలకు పరిష్కారం చూపించాలన్నారు.

## అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి



అంగన్వాడీల డిమాండ్

**గంగవరం పెన్ పవర్, మార్చి 31:**అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేసి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ సంఘమైన ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం గంగవరం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ సిబ్బంది ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పోలవరం జిల్లా నాయకురాలు కే రాణి మాట్లాడుతూ, అంగన్వాడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులకు మెమోరాండం సమర్పించినట్లు తెలిపారు. అంగన్వాడీలకు కనీస వేతనం పెంపు, ఎండల తీవ్రత దృష్ట్యా వేసవి సెలవులు ప్రకటించడం, వేతన కోతలను వెంటనే నిలిపివేయడం వంటి ప్రధాన డిమాండ్లు ఉంచినట్లు చెప్పారు.మార్చి 2న జరిగిన "చలో విజయవాడ" కార్యక్రమానికి ఒక రోజు వేతనం కట్ చేయడమే కాకుండా, మార్చి 3న హోలీ పండుగ రోజుకూ వేతనం కోత విధించడం అన్యాయమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రోజు వేతనాన్ని వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సిడిపిఓ సుచరిత ఆదిలక్ష్మికి అందజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గోకవరం మెయిన్ రోడ్డు లో పైప్ లైన్ లీకై ఏరులై పారుతున్న త్రాగునీరు....





- పట్టించుకోని పంచాయతీ అధికారులకు....
- మేజర్ డ్రైన్ పక్కనే లీకేజ్ ఏదైనా ప్రమాదం జరిగితే గ్రామ ప్రజలు ఆరోగ్యానికి ఎవరు భరోసా...

**గోకవరం పెన్ పవర్ మార్చి 31:--** పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో గత పది రోజులుగా గోకవరం ప్రధాన రహదారిపై త్రాగునీరు ఏరులై పారుతుంది. ప్రతిరోజు వేల సంఖ్యలో అనునిత్యం ప్రజల నడిచే ఈ రోడ్డులో ఎంత బహిరంగంగా త్రాగునీరు వృధా అవుతుంటే వ్యాసం దృష్టిలో పెట్టుకుని అయినా పంచాయతీ వాళ్ళు పట్టించుకోకపోవడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గోకవరం ప్రధాన రహదారిలోని గవర్నమెంట్ హాస్పటల్ పాత గేటు ఎదురుగా ఉన్న వెలమపేట వైపు పంచాయతీ పైప్లైన్ ఒకటి ఉంది ఇది పంచాయతీదా లేక గోదావరి సత్యసాయి వాటర్ ద అనేది వెలికి తీస్తేనే గాని తెలియదు, ఏది ఏమైనా తీవ్రమైన ఎండలు వేసవి దృష్టిలో ఉంచుకుని మంచినీటి సౌకర్యాలకు ఎక్కడ ఆటంకం కలగకుండా ఉండాలని నిరంతర పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేస్తు ప్రత్యేక అధికారులను నియమించిన అనేకమంది జిల్లా ఉన్నతాధికారులు నడి ఆడుతున్న ఈ రహదారిలో గత పది రోజులుగా నీరు లీక్ అయ్యి తారు రోడ్డు మీద ప్రవహిస్తున్న కనీసం గోకవరం పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ఈ అధికారులు ఉన్నతాధికారి ఆదేశాలను ప్రజల సౌకర్యాలను ఎంత తేలికగా తీసుకుంటున్నారో అని పలువురు పెదవిరుస్తున్నారు. వెలమపేట ముఖద్వారం వద్ద ప్రధాన డ్రైనేజ్ ప్రక్కన ఈ లీకేజీ రావడం పొరపాటున ఈ లీకేజ్ లో డ్రైనేజీ వాటర్ కలిస్తే ప్రజల ఆరోగ్యానికి ఎవరు బాధ్యత వహిస్తారు అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా జరిగితే పంచాయతీ అధికారులు దీనికి బాధ్యత వహించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికైనా గోకవరం పంచాయతీ అధికారం స్పందించి ఈ పైప్లైన్ సరిచేయించి ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూస్తారని పలువురు కోరుతున్నారు.

## నీరు లేదు మద్యం జోరు..





### కానరాని ఎక్స్ఛేంజ్ పనితీరు..

**కోరుకొండ, పెన్ పవర్, మార్చి 31:**కోరుకొండ మండలంలో తాగడానికి మంచి నీళ్లు కన్నా అక్రమ మద్యం వ్యాపారం జోరు కొనసాగుతుంది. కానరాని ఎక్స్ఛేంజ్ పనితీరు. ఊరూరా విస్తరించిన బెల్ట్ షాపులు సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, ఎమ్మార్పీ ధరల కంటే భారీగా అదనపు వసూళ్లు చేస్తూ బెల్ట్ షాపుల నిర్వాహకులు బరితెగిస్తున్నారు.

### నిబంధనలు గాలికి..

మండలంలోని దాదాపు ప్రతి గ్రామంలోనూ కిరాణా కొట్లు, చిన్నపాటి పాకల్లో మద్యం ఏరులై పారుతోంది. ఒక్కో బాటిల్‌పై రూ. 20 నుండి రూ. 50 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు సమయంతో సంబంధం లేకుండా విక్రయాలు సాగుతున్నా, ఎక్సైజ్ శాఖాధికారులు కనీసం అటువైపు చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### కుటుంబాలు చిన్నాభిన్నం

గ్రామాల్లో మద్యం సులభంగా అందుబాటులోకి రావడంతో కూలీలు, యువత ఈ వ్యసనానికి బానిసలవుతున్నారు. కష్టపడి సంపాదించిన డబ్బునంతా మద్యం బాటిళ్లకే తగలేస్తుండటంతో ఎన్నో పేద కుటుంబాలు తిండికి లేక రోడ్డున పడుతున్నాయి. మహిళలు తమ గోడును వెళ్లబోసుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల మౌనం.. అంతర్యమేమిటి?

ఇంత బహిరంగంగా అక్రమ విక్రయాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. అధికారుల అండదండలతోనే ఈ దందా సాగుతోందని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, కోరుకొండ మండలంలో బెల్ట్ షాపులను అరికట్టాలని, ఎమ్మార్పీకే మద్యం విక్రయించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రీల్స్ కి కేరాఫ్ అడ్రస్ రాజానగరం ..

- అందరిదీ ఒకటే బాట..
- చేసేది గోరంత చెప్పేది కొండంత..
- రీల్స్ లో సినిమా చూపిస్తున్న నాయకులు..
- కనీసం స్థానిక ఎమ్మెల్యే కూడా అదే రీతిలో ప్రయాణం.

**కోరుకొండ, పెన్ పవర్, మార్చి 31:** రాజానగరం నియోజకవర్గ రీల్స్ చేసుకోవడానికి క్యారఫ్ అడ్రస్ గా మారింది. రాజకీయ ప్రజాప్రతినిధులకు ఒకప్పుడు మీడియా ముందుకు వచ్చి ప్రజలకు తెలియపరిచేవారు. పెరిగిన టెక్నాలజీ ప్రకారం ప్రజాప్రతినిలకు సొంతంగా కెమెరామెన్ వీడియో గ్రాఫర్ పెట్టుకుని రీల్స్ చేస్తున్నారు. కెమెరామెన్ ఎక్కడి నవ్వాలి ఎక్కడ ఏడవాలి ఎక్కడ కూర్చోవాలి ఎక్కడ తినాలి చెబుతున్నారు. రాజానగరం నియోజకవర్గ ప్రజాప్రతినిధులు రీల్స్ కు అనుగుణంగా మాటలు మాట్లాడడం ఒకరి మించి ఒకరు తయారయ్యారు. ఇదిలా ఉండగా స్థానిక ఎమ్మెల్యే కూడా ఇదే బాటలో వెళ్లడం అధికారులు కూడా కనీసం మీడియా కూడా సమాచారం ఇవ్వకపోవడం గమనారహం. ఏదో ఎలక్షన్ ముందు ఏదైనా చేస్తే బాగుంటుంది కానీ అధికారం చేపట్టిన తర్వాత కూడా రైల్స్ రూపంలోనే భజన చేయడం దాన్ని మీడియా గ్రూపులో పెట్టడం కొద్ది తలనొప్పిగా మారింది. ప్రభుత్వ అధికారుల సైతం కూడా మీడియాకు సహకరించకపోవడం రీల్స్ లో వచ్చింది రాసుకోమని చెప్పడం విశేషం.



పెన్ పవర్


# ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ప్రోటోకాల్ అవమానం

✷ గిరిజన సంఘం ఆగ్రహం




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ మార్చి 31 :**ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పి--4 తొలి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ప్రోటోకాల్ ఉల్లంఘన జరగడం వివాదాస్పదంగా మారింది. ఈ ఘటనపై ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు తగిన గౌరవం ఇవ్వకపోవడం గిరిజన సమాజాన్ని అవమానించినట్టేనని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో చైర్మన్ పాల్గొన్నప్పటికీ, ప్రోటోకాల్ ప్రకారం కేటాయించాల్సిన మధ్య సీటు ఇవ్వకుండా చివరన కూర్చోబెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా, తరువాత స్థానిక ఎమ్మెల్యే, అనంతరం జిల్లా కలెక్టర్‌కు స్థానాలు కేటాయించాల్సి ఉంటుంది. ముఖ్యంగా చైర్మన్ రాష్ట్ర అతిథిగా (స్టేట్ గెస్ట్) పరిగణించబడే సందర్భంలో, వేదికపై కేంద్ర స్థానంలో కూర్చోబెట్టడం ఆనవాయితీగా ఉంటుందని తెలిపారు.ఈ నేపథ్యంలో జరిగిన ప్రోటోకాల్ ఉల్లంఘనపై జిల్లా కలెక్టర్ మరియు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ తక్షణమే స్పందించి వివరణ ఇవ్వాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రామారావు డిమాండ్ చేశారు. అలాగే ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు జరిగిన అవమానంపై ఐటీడీఏ అధికారులు బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు.భవిష్యత్తులో గిరిజన ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో ప్రోటోకాల్ నిబంధనలు కచ్చితంగా పాటించి, గిరిజన హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని ఆయన సూచించారు.

## మత విద్వేషాలు రెచ్చగొడితే సహించం.

✷ వైసిపి నేతలను హెచ్చరించిన ఎమ్మెల్యే బొలిశెట్టి.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 31.** ప్రజల మధ్య మత విద్వేషాలు సృష్టించి, రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం దురదృష్టకరమని, ఇలాంటి పెడ ధోరణులను సహించమబోని

శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ వైసీపీ నేతలను హెచ్చరించారు. ఉండి నియోజకవర్గం,ఆకివీడు రామాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే సందర్శించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా ఆకివీడు రామాలయంలో జరిగింది దుర్మార్గమైన సంఘటన అని ఆయన పేర్కొన్నారు. శ్రీరాముడికి దండలు వేయడానికి వెళ్ళిన స్థానిక శాసనసభ్యులు రఘురామకృష్ణం రాజు, పలువురు జనసైనికులపై కొందరు ఉన్మాదులు దాడులు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. భారతదేశంలో ఆంధ్ర రాష్ట్రంలో ఒక రామాలయంలో రాముడికి పూజలు నిర్వహించడానికి తమ అనుమతి తీసుకోవాలని ఒక వర్గం వారు అనటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుందని అన్నారు. హిందూ ధర్మం ఏ పరిస్థితిలో ఉందో ఆలోచించాలన్నారు. భారతీయ సంస్కృతిలో అన్ని మతాలకు సమాన గౌరవం ఉందని అన్నారు. సమాజంలో స్నేహపూర్వక వాతావరణం చెడగొట్టే విధంగా వైసీపీ నేతలు ప్రవర్తించడం దారుణమని విమర్శించారు. జన సైనికులకు తమ పూర్తిగా అండగా ఉంటామని తెలియజేశారు.ఈ దాడులకు తెగబడిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు. దళితులను, యువకులను తప్పుదోవ పట్టించే విధంగా ఎవరూ ప్రవర్తించవద్దని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి ఈతకోట తాతాజీ, బలుసు లక్ష్మణరావు, పుల్లా బాబి, చాపల రమేష్, మద్దాల మణికుమార్, పసల కొండ, రామ్ లక్ష్మణ్, పై బోయిన వెంకటరామయ్య, బేతిన గిరిధర్, పిడుగు రామ్మోహన్ బ్రదర్స్, గట్టెం నాని, కూటమి నాయకులు పాల్గొన్నారు

## అమరావతికి నిబద్ధతతో ఉన్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి మాత్రమే



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 31:**అమరావతికి నిబద్ధతతో ఉన్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి మాత్రమే అని అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ వడ్డి రఘురామ్ నాయుడు. ఆయన తాడేపల్లిగూడెం వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ. ఇప్పుడు చంద్రబాబు అమరావతిలో ఇల్లు కడుతున్నారు కానీ ఎప్పుడో జగన్మోహన్ రెడ్డి అక్కడ ఇల్లు కట్టారని గుర్తుచేశారు. అమరావతిలో పూల్ చేసిన భూముల్లో ఆనాడు చంద్రబాబు సింగపూర్ అని గ్రాఫిక్స్ చూపించారన్నారు. ఇప్పుడు మళ్ళీ అసెంబ్లీలో అమరావతి రాజధాని తీర్మానం అని చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో పరిపాలన వికేంద్రీకరణ అవుతుందనే ఉద్దేశ్యంతో మూడు రాజధాని అని చెప్తే పెద్ద గొడవ చేశారన్నారు. అమరావతి రైతులు త్యాగం చేసి ఇచ్చిన భూములకు ఏంటి చంద్రబాబు ఇచ్చిన విలువ ఏంటని,. వాళ్లకు ఏం న్యాయం చేశారని ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు 2028 నాటికి రాజధాని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. రాజధాని ఏర్పాటుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదన్నారు. అలాగే తాడేపల్లిగూడెంలో పెద్ద ఎత్తున జరిగిన బలుసులమ్మ అమ్మవారి జాతరకు సంబంధించి విరాళాలు ఖర్చులు వివరాలు ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు మేలు జరగలేదని చెప్పడం జరిగిందని గత ప్రభుత్వ హయాంలో జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఎంత మేలు చేశారు ప్రజలకే తెలుసున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేసిన అభివృద్ధి కార్యక్రమాలు అన్నీ కూడా ప్రభుత్వ నిధులతోనే చేశారు తప్ప ప్రజల దగ్గర విరాళాలు ఏమి సేకరించలేదని అన్నారు. 2014లో అప్పటి మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు అప్పటి మున్సిపల్ చైర్మన్, ప్రస్తుత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కలిసి ఇక్కడ స్విమ్మింగ్ పూల్ ఇండోర్ స్టేడియం తీసుకొచ్చామన్నారని అంటున్నారని అప్పుడు మీలో మీకు పడక మంజూరు అయిన ఏసి రైతు బజారు కాస్త అది చండీగఢ్ కి వెళ్ళిపోయిందన్నారు. ఆ విషయం కూడా ప్రజలకు చెప్తే బాగుంటుందన్నారు. అలాగే స్విమ్మింగ్ పూల్ అభివృద్ధికి ప్రజలు స్థానికులు విరాళాలు అందించాలని వారి వివరాలు కూడా అక్కడ ఏర్పాటు చేయాలన్నది ప్రజల ఆకాంక్ష అన్నారు. స్విమ్మింగ్ పూల్ ఇండోర్ స్టేడియం తీసుకురావడానికి దిగంగత నేత మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు కారణమని స్వయంగా మీరే చెప్పారని ఆయన పేరు పెడితే ప్రజలు చాలా సంతోషపడతారని అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం లో ఎంతో మంది మహానుభావులు ఉన్నారని వారి పేర్లు కూడా అభివృద్ధి పనులకు పెడితే ప్రజలు హర్షిస్తారని అన్నారు. నియోజకవర్గానికి, ప్రజలకు అభివృద్ధి జరిగితే తప్పకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున హర్షం వ్యక్తం చేస్తామన్నారు. ఎస్వీఆర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేస్తున్న ఫుడ్ స్ట్రీట్ స్టాల్స్ కు సంబంధించి ఏ పాతిపదికన వాటిని అందిస్తారో ఎంత వసూలు చేస్తారు అనేవాటి వివరాలను కూడా ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ కొప్పుల వల్ల కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, పెంటపాడు మండల అధ్యక్షులు కైకాల శ్రీనివాస్, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు వైసిపి నాయకులు గుండుబోగుల నాగు, కలిశెట్టి తాతారావు, మాకరాజ సతీష్, కాకర్ల శ్రీనివాస్, తానేటి అజయ్, పట్నాల గణపతి మరియు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్వర్యం లో జాతర సమయంలో విశేష సేవలు అందించిన మానవతామూర్తులకు పురస్కార జ్ఞాపికలు.






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 31.**మంగళవారం నెలవారీ ఆఖరి సమావేశం స్థానిక పచ్చ వెంకటేశ్వర బిల్డింగ్ నందు జరిగినది. ఈ సమావేశంలో శ్రీ బలుసులమ్మ తల్లి జాతర సమయంలో విశేష సేవలు అందించిన మానవతామూర్తులకు పురస్కార జ్ఞాపికలు అందజేయడమైనది

జాతర జరిగిన 16 రోజులు మజ్జిగ చలివేంద్రం నిర్వహణకు అవసరమైన ఆర్థిక సహకారం అందించిన దాతలకు జ్ఞాపిక అందించి సత్కరించడమైనది.

ఈ కార్యక్రమానికి మానవతా అధ్యక్షులు జినపనేని రాజేంద్ర కుమార్ అధ్యక్షత వహించారు

ఈ కార్యక్రమంలో మానవతా చైర్ పర్సన్ పైడికొండల సింధు మాట్లాడుతూ మజ్జిగ చలివేంద్ర నిర్వహణలో పూర్తి సమయాన్నీ కేటాయించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాజేంద్రకుమార్ మాట్లాడుతూ మానవతకు సొంత కార్యాలయం ఏర్పాటు గురించి ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నామని అన్నారు

వెంటనే గౌరవ మానవత సభ్యులు కంచర్ల నరసింహం లేచి తమ వంతుగా ఒక లక్ష రూపాయలు. సభ్యులు ఆరుగోలను సొసైటీ చైర్మన్ శ్రీ యు. వి. వి. సత్యనారాయణ తమ వంతుగా 50వేల రూపాయలు విరాళం ప్రకటించారు. మనం చేసే ప్రతీ కార్యక్రమానికి మీలాంటి పెద్దల సహకారం ప్రోత్సాహం ఉండాలని సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మార్చి నెలలో జరిగిన మరియు ఏప్రిల్ నెలలో జరగబోవు కార్యక్రమాల గురించి చర్చించుకోవడం జరిగింది.

ఈ సమావేశంలో మానవతా చైర్ పర్సన్ పైడికొండల సింధు, అధ్యక్షులు జనపనేని రాజేంద్ర కుమార్, సెక్రటరీ మిరియాల కిషోర్ కుమార్, ట్రెజరర్ ఎర్ర ఆంజనేయస్వామి, చేకూరి బంగారు రాజు, బురిడీ సతీష్, ఎగ్గిన శరత్, జకిలింకి రామకృష్ణ, గ్రంధి సత్యనారాయణ,రిటైర్డ్ మాస్టర్ నాగరాజు , కే వెంకటాచలం, కే రాజారావు, పి వెంకటేశ్వరరావు, డిపి నాయుడు, శర్మ,, కంచర్ల నరసింహ, సిహెచ్ వెంకటరమణ, యు వి వి సత్యనారాయణ, ఎల్ఐసి పాండురంగారావు, బి ప్రకాష్, సత్తి జగన్మోహన్, బి అరుణ, బి లక్ష్మి, ప్రశాంతి, షర్మిల, కే విజయ్ కుమారి, ఆర్ శ్రీ లీల, చుక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం 40 మంది సభ్యులతో ఆహ్లాదకరంగా జరిగింది. సెక్రటరీ కిషోర్ కుమార్ వందన సమర్పణ చేశారు.

## మీ భద్రతే మా బాధ్యత -ఎస్సై



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, మార్చి 31;** వేసవికాలంలో దొంగతనాలు నివారించేందుకు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఎస్సై వి క్రాంతి కుమార్ సూచించారు. మంగళవారం పోలీస్ స్టేషన్లో మాట్లాడుతూ గ్రామ వీధులలో సమూహంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఇంటి గేటుకు మెయిన్ డోర్ కు బలమైన తాళాలు వేసి బయటకు వెళ్లాలి అన్నారు. బయటకు వెళ్లేటప్పుడు గేట్లు మెయిన్ డోర్లకు కర్టెన్లు కవరు చేసి ఇంట్లో లైట్స్ వేసుకొని ఇల్లు ఖాళీగా ఉన్నట్లు కనిపించకుండా జాగ్రత్త పడాలని అన్నారు. ఎక్కువ కాలం పాటు బయటకు వెళ్లే సమయంలో నమ్మకమైన వ్యక్తులకు ఇల్లు అప్పగించి వెళ్లాలని అన్నారు. ఇంటి వద్ద నగదు, బంగారం వంటి విలువైన వస్తువులు నిర్లక్ష్యంగా ఉంచవద్దని అన్నారు. తెలియని వ్యక్తులను ఇంటి వద్దకు అనుమతించవద్దని తెలిపారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు .రాత్రి సమయాల్లో వీధిలైట్లు పనిచేసేలా చూసుకోవాలని అన్నారు. పో రుగు వారితో పరస్పరం మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నెంబర్ కు ఫోన్ చేసి సమీప పోలీస్ స్టేషన్ ని సంప్రదించాలని అన్నారు. దొంగతనాల నివారణలో ప్రజలదే ప్రముఖ పాత్ర అని అన్నారు. మీ భద్రతే మా బాధ్యత కనుక పోలీసు వారికి సహకరించాలని సూచించారు.

## రాష్ట్రస్థాయి అండర్ -9 చదరంగం పోటీలకు ఎంపిక



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 31:**మాస్టర్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక ఆంగ్లో ఇండియన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ అండర్ -9 బాల బాలికల విభాగాల వారిగా చదరంగం జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు ఉదయం 10 గంటలకు గంటలు ప్రారంభమైనవి ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి సుమారు 20 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మరియు ఈ పోటీలకు స్పాన్సర్ గా వహించిన ఆంగ్లో ఇండియన్స్ స్కూల్ డైరెక్టర్ రాకేష్ విజేతలకు మెమెంటాస్ ప్రశంస పత్రాలు అందజేశారు అనంతరం కార్యక్రమంలో వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ టోర్నమెంట్ కమిటీ కన్వీనర్ ఎస్ చంద్రశేఖర్ కమిటీ మెంబర్స్ ఎల్ అరవింద్ బాబు జె రాంబాబు చీఫ్ ఆర్బిటర్ వై.డి ప్రసాద్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి రెండు స్థానాలు గెలుపొందిన క్రీడాకారులు జూన్ నెల తూర్పుగోదావరి జిల్లాలో జరుగు రాష్ట్రస్థాయి అండర్ -9 చదరంగం పోటీలకు మన జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ఎస్.ఎస్.చంద్రశేఖర్ తెలియజేశారు. విజేతల వివరాలు మొదటి స్థానం బాలుర విభాగంలో తాడేపల్లిగూడెం చెందిన కే ఏసీల్ ద్వితీయ స్థానం నల్లజర్ కింగ్స్ వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్ చెందిన దాపత్తి ఆరుష బాలికల విభాగంలో భీమవరం చెందిన బి .అశ్విత వర్మ ద్వితీయ స్థానం తాడేపల్లిగూడెం చెందిన సి. జోష్నికా మన జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు.


# ఉచిత మేఘ మెడికల్ క్యాంపు నిర్వహణ

**జీలుగుమిల్లి, పెన్ పవర్, మార్చి 31;** జి ఎస్ ఎం ఫౌండేషన్ ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలని ఉద్దేశంతో ఈ ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు జి ఎస్ ఎం ఫౌండేషన్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్ అన్నారు. మంగళవారం జీలుగుమిల్లిలో జి ఎస్ ఎం గార్డెన్లో ఉచిత మేఘ మెడికల్ క్యాంపు ను ఆయన ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 13 మందికి కంటి ఆపరేషన్ చేయాలని గుర్తించారు. సమీప గ్రామాల నుండి వచ్చిన రోగుల ను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చిన్నపిల్లలు, జనరల్, కంటికి సంబంధించిన వైద్యులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం కి చెందిన రామచంద్ర ,శంకర నేత్ర చికిత్సలయం, సాయి దుర్గ మల్టీ స్పెషాలిటీ వైద్య సిబ్బంది శిబిరం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ దుర్గరాజు, మాజీ రైల్వే ఎంప్లాయ్ జనరల్ మెడిసిన్ డాక్టర్ సాయి, తదితర సిబ్బంది ఉన్నారు



## అన్న క్యాంటీన్లను సమర్థవంతంగా నిర్వహించాలి

కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 31**:నగరం లో అన్నా క్యాంటీన్లను సమర్థవంతంగా నిర్వహించాలని కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. మంగళవారం శేషయ్యమెట్టలోని అన్నా క్యాంటీన్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆహార పట్టిక, టోకెన్ కౌంటర్, ఆహార పదార్థాలు వడ్డిస్తున్న స్థలం, డైనింగ్ ఏరియాతో పాటు తాగునీరు అందించే ఏర్పాట్లను పరిశీలించారు. అల్పాహారం తీసుకుంటున్న ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి క్యాంటీన్ సమయానికి తెరుస్తున్నారా ? ఆహార పదార్థాల నాణ్యత ఎలా ఉంది ? ఏమైనా ఫిర్యాదులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ అభిప్రాయాలు క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తెలియజేయవచ్చున్నారు. అనంతరం నిర్వాహకులతో మాట్లాడుతూ , రోజుకు ఎంతమంది క్యాంటీన్ కు వస్తారో ఆరా తీశారు. ప్రజలకు సకాలంలో నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని, క్యాంటీన్ పరిసరాల్లో స్వచ్ఛతా నియమాలు పాటించాలన్నారు. శుద్ధి చేసిన నీటిని అందించాలని, ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని స్పష్టం చేశారు. క్యాంటీన్ల నిర్వహణకు సంబంధించి నోడల్ అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు

## మైక్రోబయాలజీ విద్యార్థులకు కోసం రూ.2 లక్షల విరాళం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 31:**విద్యా రంగానికి ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రతి సంవత్సరం గోల్డ్ మెడల్ అందించేందుకు రూ.2 లక్షల విరాళాన్ని విభాగాధిపతి మజ్జి భారతి అందించారు. మజ్జి భారతి తమ తల్లి లోలాక్షి స్మారకార్థం ఈ విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు.

ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ మైక్రోబయాలజీ విభాగంలో మెరిట్ సాధించే విద్యార్థులను ప్రోత్సహించేం దుకు ప్రతి సంవత్సరం గోల్డ్ మెడల్ అందించాలనే ఉద్దేశంతో ఈ నిధిని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని ఫిక్స్డ్ డిపాజిట్లో ఉంచి, వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి గోల్డ్ మెడల్ అందజేస్తారని తెలిపారు. విద్యార్థులు మరింత ప్రతిభ కనబరచి ఉన్నత స్థాయికి చేరాలని, ఇలాంటి ప్రోత్సాహకాలు వారికి ఉత్సాహాన్ని ఇస్తాయని కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెనడీ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శివ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శారదా, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

- అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ 31:**నిరంతరం న్యాయ పరిరక్షణ కోసం పాటుపడే న్యాయవాదులకు న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ కోరుతూ న్యాయవాదులు ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులకు పంపించాలని స్థానిక ఆర్డీవో వినతి పత్రం అందచేసారు. ఈ సందర్భంగా సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఇటీవల కాలంలో దేశంలో న్యాయవాదులపై దాడులు ఎక్కువయ్యాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. సొసైటీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కొండేటి వరలక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ కోసం ఇటీవల రక్షణ చట్టం ఏర్పాటు చేసిందని ఈ విధంగా ఏపీ రాష్ట్రంలోనూ, దేశంలోనూ న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర సహ కార్యదర్శి బీర అరుణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్యాడ శ్రీనివాసరావు, గోసాల రాజేష్ కుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు కొల్లి మహదేవ్, కొల్లి రత్నరాజు, ఎండి అస్పర్ ఖాన్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వీధి దుర్గాప్రసాద్, గుమ్మడి గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రానున్న మునిసిపల్, పంచాయతీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ



రాష్ట్ర అధ్యక్షుడు శీర రమేష్ కుమార్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్,మార్చి 31 :**

రానున్న మునిసిపల్, పంచాయతీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (అప్) పోటీ చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు శీర రమేష్ కుమార్ అన్నారు. స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలో అంబేద్కర్ విగ్రహం కు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు శీర రమేష్ కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, కర్షక, యువజన, మహిళలకు రానున్న ఎన్నికలలో తమ పార్టీ ప్రాధాన్యత ఇచ్చి పోటీ చేయించాలని భావిస్తున్నదన్నారు. పార్టీలో చేరేందుకు యువతను ఆహ్వానం పలుకుతున్నామన్నారు. ఏపీ లో పార్టీని ప్రజల చెంతకుతీసుకువెళుతు న్నామన్నారు. ప్రైవేటు విద్యా విధానాన్ని రూపుమాపి ఉన్నత, నాణ్యమైన ప్రభుత్వ ఉచిత విద్యను అందించే లక్ష్యంగా తమ పార్టీ పనిచేస్తుందన్నారు. జరగబోవు మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డ్ నుండి ఆమ్ ఆద్మీ పార్టీ తరపున యువతకు ప్రాధాన్యత ఇస్తామని, పార్టీలో చేరే వారు తమను సంప్రదించాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి మరి దుర్భరంగా మారాయని, అరకొర వసతులతో నడుస్తున్నాయని ప్రజల్లో ప్రభుత్వం తీరుపై వ్యతిరేకత నెలకొందని శీర రమేష్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని , రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. డీజిల్, పెట్రోల్, వంట సరుకులు, గ్యాస్ కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో ఆప్ రాష్ట్ర కమిటీ పోస్టర్ ను జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాసరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు డి సుమలత, జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షులు సంతోష్ జిల్లా యువజన అధ్యక్షులు మారిశెట్టి ప్రవీణ్ విద్యాసాగర్ రాష్ట్ర మీడియా నాయకులు జానీ రాయ్ లు ఆవిష్కరించారు.

కరపత్రాల ద్వారా ప్రజల్లో మార్పు తెచ్చేందుకు, రాజకీయం పట్ల ప్రజల్లో అవగాహన పెరిగే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని జిల్లా కన్వీనర్ యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. 2029 ఎన్నికలలో అన్ని నియోజకవర్గాల్లో ఆమ్ ఆద్మీ తమ సత్తా చాటుకుంటుందని అంతేకాకుండా కార్పొరేషన్ ఎన్నికల్లో మహిళలకు ఎక్కువ శాతం ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు ఆమ్ ఆద్మీ తీసుకుంటుందని అన్నారు. రాష్ట్రంలో మూడవ రాజకీయ పార్టీగా నిలవనుంది అని తెలిపారు.

ప్రస్తుత ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి ఎన్నికలు నెగ్గాక కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను మరిచిందని గుర్తు చేశారు. బకాయి పడిన ఆరోగ్య శ్రీ డబ్బులు వెంటనే విడుదల చేయాలని చేయకపోతే రానున్న రోజుల్లో ప్రజల జీవితాలకు వారి భవిష్యత్తుకు చాలా నష్టం కలుగుతుందని, ప్రాణహాని ఎక్కువ కాబోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అప్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు శీర రమేష్ కుమార్, జిల్లా కన్వీనర్ యార్లగడ్డ శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు సుమలత, యువజన విభాగ అధ్యక్షులు మారిశెట్టి ప్రవీణ్, స్టూడెంట్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్ తదితర జిల్లా నాయకులు పాల్గొన్నారు

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పదవి లేకున్నా ప్రజాసేవలో కొనసాగాలి.







**సర్పంచ్ లకు ఎమ్మెల్యే సూచన.**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 31.**పదవి ఉన్నా,లేకున్నా సర్పంచ్ లు ప్రజాసేవ కొనసాగించాలని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో మంగళవారం సర్పంచుల అభినందన సభ జరిగింది. తాడేపల్లిగూడెం గ్రామీణ మండలంలో గత 5 సంవత్సరాలుగా సర్పంచ్ లు గా పనిచేసి ఏప్రిల్ 2న పదవీ విరమణ చేయనున్న సర్పంచులు అందరినీ ఎమ్మెల్యే సత్కరించి నూతన వస్త్రాలు బహూకరించారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్తు అధ్యక్షురాలు పొనుకుమాటి శేషులత ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలతో, పదవులతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజా జీవితంలో ఉండి,ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే వారికి ప్రజలలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని అన్నారు. గత వైసిపి హయాంలో సర్పంచులకు గౌరవం లేకుండా చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా గ్రామాలకు మహర్దశ తీసుకువచ్చారని అన్నారు. సర్పంచులకు గౌరవ మర్యాదలతో పాటు, నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించారని అన్నారు. సర్పంచ్ లు ప్రజలలో తిరగలేని పరిస్థితి నుంచి,తమ గ్రామ అభివృద్ధికి పాటుపడ్డామని ధైర్యంగా చెప్పుకునే విధంగా పవన్ అవకాశం కల్పించారని అన్నారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ల సహకారంతో రాష్ట్రంలో ప్రతి గ్రామపంచాయతీ ప్రగతి పథంలో పయనిస్తుందన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా సర్పంచులు అందరూ ఎంతో సంతృప్తిగా పదవీ విరమణ చేసే పరిస్థితులు నెలకొన్నయన్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టే నాటికి తాడేపల్లిగూడెంలో ఏ గ్రామానికి వెళ్లాలన్నా భయపడే పరిస్థితి ఉందని రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గ్రామీణ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని విమర్శించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్ భారీగా నిధులు కేటాయించారని, ప్రతి గ్రామానికి నాణ్యమైన రోడ్లు నిర్మించామని అన్నారు. ప్రతి గ్రామానికి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి, విద్యుత్తు, రక్షిత మంచినీరు తదితర మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పిస్తామని అన్నారు. అభివృద్ధి విషయంలో కూడా వైసిపి నాయకులు రాజకీయం చేయడం తగదని విమర్శించారు. తాను పార్టీలకు సంబంధం లేకుండా ప్రతి సర్పంచ్ ను, ప్రతి ఎంపీటీసీని గౌరవించి, ఆయా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని అన్నారు. వైసిపి నేతలు విష ప్రచారంతో అభివృద్ధికి అడ్డు తగులుతున్నారని,ఈ విషయం ప్రజలు గమనించాలన్నారు. తమ పదవి కాలంలో గ్రామాల అభివృద్ధికి కృషిచేసిన సర్పంచ్ లు అందరికీ ఆయన అభినందనలు తెలియజేశారు. సమావేశానికి ముందు తాహాసిల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వి బి జి రామ్ జీ పథకం నిర్వహణ కార్యాలయానికి ఆయన ప్రారంభోత్సవం చేశారు.వంద రోజులు పని దినాలను దిగ్విజయంగా నిర్వహించిన ఇద్దరు మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రత్యేక అధికారిజీవీకే.మల్లికార్జున రావు, మండల పరిషత్తు అభివృద్ధి అధికారి చంద్రశేఖర్, పురపాలక సంఘ కమీషనర్ ఎమ్. యేసు బాబు, జడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు, ఎంపీటీసీలు, పోతుల అన్నవరం. పుల్లా బాబి, పసుమర్తి రామ లక్ష్మణ్, వాడపల్లి సుబ్బరాజు, చాపల రమేష్, మద్దాల మణికుమార్, గట్టెం నాని, సర్పంచులు,మండల పరిషత్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ వర్కర్లు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేత...





**అడ్డతీగల, పెన్ పవర్, మార్చ్31;** మంగళవారం అడ్డతీగల ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. వారికి కనీస వేతనాలు 26 వేలు ఇవ్వాలని, అలాగే మే నెల అంతా వేసవి సెలవులు ప్రకటించాలని, డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అడ్డతీగల, వై .రామవరం సెక్టర్ లోని వర్కర్లంతా ఈ ధర్నాలో పాల్గొని నినాదాలు చేశారు. అనంతరంఐ.సి.డి.ఎస్ అనంతరంసూపర్వైజర్ అరుణలతకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష రాలు జి. బేబీ రాణి కోశాధికారి, జి.పార్వతి ,సెక్టార్ లీడర్స్ బి. విజయ. కె.బుల్లమ్మ. వీరలక్ష్మి. అంగన్వాడీ వర్కర్లు.హెల్పర్స్ ఈ ధర్నాలో పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయాలి



సీఐటీయూ డిమాండ్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ , మార్చి 31 :**అంగన్వాడీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించి కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రంపచోడవరం అంగన్వాడీ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా సీఐటీయూ పోలవరం జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ, అంగన్వాడీ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా అంగన్వాడీ సిబ్బందికి వేసవి సెలవులు ప్రకటించాలని కోరారు. మార్చి 2న నిర్వహించిన 'చలో విజయవాడ' ధర్నాకు సంబంధించిన ఒక రోజు వేతనం కట్ చేయాల్సి ఉండగా, మార్చి 3న హోలీ రోజుకు కూడా వేతనం కట్ చేయడం అన్యాయమని విమర్శించారు. ఆ రోజుకు సంబంధించిన వేతనాన్ని వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం సమస్యలతో కూడిన మెమోరాండాన్ని అంగన్వాడీ ప్రాజెక్టు సీడీపీఓకు అందజేశారు. దీనిపై సీడీపీఓ సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.ఇతర సమస్యల పరిష్కారం కోసం యూనియన్ చేపట్టే భవిష్యత్ ఉద్యమాలకు అంగన్వాడీ కార్మికులు సిద్ధంగా ఉండాలని వాణిశ్రీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షులు సింగారమ్మ, పోశమ్మ, పుష్ప, బుల్లియమ్మ, ఉషా తదితరులు, పెద్ద సంఖ్యలో వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

# పౌల్ట్రీ రంగంలో నమక్కల్ మోడల్‌ను అధ్యయం కోసం కమిటీ ఏర్పాటు

**– కలెక్టర్ కీర్తి చేకూరి**




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 31** పౌల్ట్రీ రంగం ఎదుర్కొంటున్న సమస్యలకు తమిళనాడులోని నమక్కల్ మోడల్‌ను అధ్యయనం చేసి జిల్లాలో అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తూ, పౌల్ట్రీ అభివృద్ధి, ఎగుమతుల విస్తరణపై సమగ్ర అధ్యయనం చేయాలని ఆదేశించారు. జిల్లాలో పౌల్ట్రీ రంగం ఎదుర్కొంటున్న సమస్యలకు సమగ్ర పరిష్కార మార్గం, రైతులకు స్థిరమైన ఆదాయం, ఎగుమతుల అవకాశాలను విస్తరించడం ప్రధాన ఉద్దేశ్యంగా ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పౌల్ట్రీ రైతులతో సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ , పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం, అధికారులు, రైతులు సమన్వయంతో పనిచేయాల్సిన ఉందన్నారు. పౌల్ట్రీ పరిశ్రమ సవాళ్లు, మార్కెట్ పరిస్థితులు, ఉత్పత్తి వ్యయాలపై చర్చించినట్లు తెలిపారు. గుడ్ల ఎగుమతుల అవకాశాలు, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి పై చర్చించి, కొత్త మార్కెట్లను పరిశీలించినట్లు చెప్పారు. పౌల్ట్రీ రంగం అభివృద్ధి కోసం ఆధునిక సదుపాయాలు కలిగిన వ్యాధి నిర్ధారణ, టాక్సికాలజీ ప్రయోగశాల ఏర్పాటు అవసరాన్ని ఆమె ప్రస్తావించారు. ఈ అంశంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. పౌల్ట్రీ రైతులు , అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గుడ్ల ధరల్లో స్థిరత్వం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామన్నారు. ఉత్పత్తి వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో మద్దతు ధరలు అవసరమని, మార్కెట్ స్థిరీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డా. టి. శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ (కొవ్వూరు) డా. బి. జయప్రకాశ్, డీడీ (ఏహెచ్) రాజమహేంద్రవరం డా. ఎం.వి. లు, పీడీ ఏపీఎంఐపీ దుర్గేష్, ఐపీవో రాజమహేంద్రవరం సూర్యప్రకాశ్, ఏపీపీఎఫ్ అధ్యక్షుడు సుబ్బారావు, కార్యదర్శి పి. సుబ్బారెడ్డి, ఎన్ఈసీసీ చైర్మన్ కె.వి. ముకుందరెడ్డి, ఎన్ఈసీసీ గోదావరి జోన్ ఎం. శ్రీనివాసరావు, ఏపీపీఎఫ్ కార్యదర్శి ఎం.ఆర్.కె. రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి.



**గోకవరం పెన్ పవర్ మార్చి 31:--** నాలుగు రోజుల క్రితం గోకవరం లోని జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి రాజమండ్రిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందాడు. దీనికి సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి గోకవరం గ్రామానికి చెందిన గోకవరం గ్రామం మురళి నగర్ నివాసేన మంగరౌతు వెంకట రమణ గోకవరంలోని శాఖ కార్యాలయం ఎదురుగా తన స్కూటీపై వస్తుండగా ఎదురుగా వస్తున్న ఒక లారీ అద్దానికి ఢీకొని వెనుక చక్రంలో పడడంతో తీవ్ర గాయాలు పాలయ్యాడు స్థానికులు హుటాహుటిన రాజమండ్రిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు చికిత్స పొందుతూ మూడు రోజులు మృత్యువుతో పోరాడి సోమవారం రాత్రి మరణించినారు, పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా మంచి స్వభావం కలిగిన మంగరౌతు వెంకటరమణ మృతి పట్ల గోకవరం గ్రామంలో విషాదం అలముకున్నాయి.



# మద్యం డబ్బుల కోసం గొడవ... యువకుడు ఉరివేసుకుని మృతి



**చింతూరు,పెన్ పవర్ మార్చి 31:** చింతూరు మండలం బీసీ కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. బాసిబోయిన కృష్ణవంశీ (25) అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, కృష్ణవంశీ తండ్రి వెంకన్న తాపీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. అయితే కృష్ణవంశీకి మద్యం సేవించే అలవాటు ఉండేది. తరచూ మద్యం కోసం డబ్బులు కావాలంటూ ఇంట్లో భార్యతో గొడవపడుతూ, డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు దిగేవాడని తెలిసింది. ఇదే క్రమంలో మంగళవారం కూడా మద్యం సేవించి ఇంటికి వచ్చిన అతను మరలా డబ్బులు కావాలని భార్యను అడిగాడు. ఆమె వద్ద డబ్బులు లేవని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో గేదెలు ఇంటికి వచ్చే సమయం కావడంతో భార్య గోదావరి ఒడ్డుకు వెళ్లింది. సాయంత్రం సుమారు నాలుగున్నర గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చేసరికి కృష్ణవంశీ ఇంటి వద్ద తాటాకు పాక దూలానికి చీరతో ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికుల సహాయంతో అతన్ని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

# ఉంగుటూరు రైతులు లేకపోతే సొసైటీలు లేవు : చైర్మన్ గన్ని వీరాంజనేయులు





**పెన్ పవర్ -- ఏలూరు జిల్లా, ఉంగుటూరు । మార్చి 31**

రైతుల ఆదరణ లేకపోతే సహకార సంఘాలు ముందుకు సాగలేవని, రైతుల అవసరాల కోసం నిరంతరం పనిచేసే సొసైటీలు మరింత అభివృద్ధి చెందుతాయని అఫ్కాట్, డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు.

ఉంగుటూరు మండలం దిచ్చేబ్రోలు విశాల సహకార సంఘం (నారాయణపురం సొసైటీ) సర్వసభ్య సమావేశం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సమావేశానికి సొసైటీ చైర్మన్ కడియాల రవిశంకర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో 2058 సహకార సంఘాలు, 13 జిల్లాల డీసీసీబీలను అఫ్కాట్ నియంత్రిస్తూ ఏటా రూ. 1 లక్షా 60 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తోందని తెలిపారు.

అఫ్కాట్ వంటి స్వయం ప్రతిపత్తి సంస్థకు చైర్మన్‌గా తనను నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే టికెట్ రాకపోయినా పార్టీకి విధేయత కారణంగానే తనకు ఈ అవకాశం దక్కిందని పేర్కొన్నారు. గత పాలకుల కారణంగా ఏలూరు డీసీసీబీ రూ.100 కోట్ల నష్టాల్లో ఉండగా, తాను చైర్మన్‌గా వచ్చిన 8 నెలల్లోనే బ్యాంకును నష్టాల నుంచి బయటకు తీసుకొచ్చామని కూటమి ప్రభుత్వ ఘనతగా వివరించారు. అలాగే బ్యాంకు డిపాజిట్లు రూ.1970 కోట్ల నుంచి రూ.2260 కోట్లకు పెంచి ఏలూరు డీసీసీబీని అగ్రగామిగా నిలిపామని చెప్పారు. రాష్ట్రంలో తొలిసారిగా ఏలూరు జిల్లాలో సొసైటీల్లో ఆన్‌లైన్ వ్యవస్థను నెలరోజుల క్రితమే ప్రారంభించామని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో మెట్టప్రాంత రైతులు రూ.500 కోట్ల టర్నోవర్, ఆక్వా రైతులు రూ.600 కోట్ల టర్నోవర్‌ను బ్యాంకుల ద్వారా నిర్వహిస్తున్నారని, అందులో కనీసం రూ.200 కోట్ల లావాదేవీలు సొసైటీల ద్వారా జరిగితే సహకార సంఘాల రూపురేఖలు మరింత మారుతాయని పేర్కొన్నారు.

సొసైటీ చైర్మన్ రవిశంకర్ మాట్లాడుతూ సొసైటీ కార్యాలయాన్ని రూ.70 లక్షలతో కార్పొరేట్ బ్యాంకు తరహాలో ఆధునీకరించామని, ఇది రైతుల సహకార ఫలితమని అన్నారు.

నాచుగుంట, వరిధి, యుర్రమళ్ల, గొల్లగూడెం, రాచూరులో ఎల్‌పాయింట్ల గోదాములు విస్తరిస్తే ఎరువుల నిల్వలు పెరిగి రైతులకు మేలు జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు వేములపల్లి సుధీర్ సూచించారు. దీనిపై స్పందించిన గన్ని, సొసైటీ తీర్మానం పంపితే 20 రోజుల్లో అనుమతులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

అలాగే దొడే రాజేష్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గన్ని అవిష్కరించారు. కొలుతు ఎమ్మెల్యే వత్సముట్ల ధర్మరాజు కూడా కార్యక్రమంలో పాల్గొని, ఆధునీకరించిన సొసైటీలో పలు విభాగాలను గన్నితో కలిసి ప్రారంభించారు. సొసైటీ ప్రాంగణానికి స్వర్గీయ మాజీ మంత్రి చింతలపాటి వరప్రసాదరావు పేరును నామకరణం చేశారు.

ఈ కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యుడు బొట్టా దుర్గారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అమ్మణ్ణి గంగాధరరావు, నారాయణపురం సర్పంచ్ దీక్ష అలకనం, మాజీ సర్పంచ్ అక్కిన నాగమణి, భీమడోలు ఏఎంసీ చైర్మన్ శేషను శేషగిరి, మారిశెట్టి ప్రసాద్, నీటి సంఘం అధ్యక్షుడు గోలి ప్రసాద్, సొసైటీ సీఈవో అయ్యంకి రంగనగేష్, సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అడ్డతీగల మండలపరిషత్ సర్వసభ్య సమావేశం.. పంచాయతీప్రజాప్రతినిధులపై ప్రశంసల జల్లు...






**అడ్డతీగల, పెన్ పవర్, మార్చ్31:** మంగళవారం అడ్డతీగల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొడ్డపాటి.రాఘవ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎం.పి.డీ.వో ఏ.వి.వి కుమార్, తాసిల్దార్ దొరకయ్య, జడ్పిటిసి మద్దాల. వీర్రాజు, ఆర్.బ్ల్యూ. ఎస్..ఏ. ఈ చందు, హౌసింగ్ ఏఈ రాజశేఖర్ బాబు, ఐ.సి.డి.ఎస్.. పిఓ క్రాంతి కుమారి , వైద్యాధికారులు, వెలుగు ఏపీఎం బి. అప్పారావు, ఎన్.ఆర్.జీ.ఎస్ ఏపీఎం చిరంజీవి , విద్యుత్ శాఖ ఏయి, అటవీశాఖ అధికారి, విద్య శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరికొంతమంది అధికారులు హాజరవగా, ఎక్సైజ్, ఆర్ అండ్ బి, తదితర కొన్ని శాఖల అధికారులు గైరాజరయ్యారని ఎంపీపీ బొడ్డపాటి. రాఘవ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులే హాజరవకపోతే ఇక ప్రజా ప్రతినిధులు అభివృద్ధిపై ఎవరితో చర్చిస్తారని ఆమె ప్రశ్నించారు.

జడ్పిటిసి మద్దాల. వీర్రాజు మాట్లాడు తూవేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని, మండలంలోని 99 గ్రామాలకు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా హ్యాండ్ బోర్లు పై ప్రత్యేక దృష్టి సారించాలని జడ్పిటిసి అధికారులకు విజ్ఞప్తి చేశారు. జడ్పిటిసి మద్దాల. వీర్రాజు సర్పంచులతో మాట్లాడుతూ మీ గ్రామాల్లో చెడిపోయిన హ్యాండ్ బోర్లు ఉంటే నేరుగా ఎంపీపీకి, ఎంపీడీవో కి తెలియపరచవచ్చని అన్నారు. అనంతరం పదవీకాలం ముగుస్తున్న సర్పంచులు వార్డు మెంబర్లకు అధికారులు ప్రజాప్రతినిధులు వారు చేసిన సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలసుబ్రమణ్యం, ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

## మారేడుమిల్లి బస్సు సర్వీసుల నిలుపుదల సరికాదు: లోతా రామారావు



**గంగవరం /రాజవొమ్మంగి, పెన్ పవర్, మార్చి 31:** నర్సీపట్నం ఆర్టీసీ డిపో అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నర్సీపట్నం--మారేడుమిల్లి బస్సు సర్వీసులను ఆకస్మికంగా నిలిపివేయడం సరైంది కాదని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు తీవ్రంగా ఖండించారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఇటీవల సీఎం కార్యక్రమం కారణంగా నర్సీపట్నం నుంచి ఉదయం, మధ్యాహ్నం నడిచే మారేడుమిల్లి బస్సు సర్వీసులను అర్ధాంతరంగా నిలిపివేశారని తెలిపారు. అదే విధంగా నర్సీపట్నంలో పండగ సందర్భంగా విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా వస్తారని తెలిసినా, ఏకైక మారేడుమిల్లి సర్వీసును కూడా నిలిపివేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఏజెన్సీ ప్రాంతాలకు నడిచే సర్వీసులపై అధికారులకు ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నారో స్పష్టంచేయాలని ఆయన ప్రశ్నించారు. విశాఖపట్నం వైపు 50కి పైగా సర్వీసులు కొనసాగుతున్నప్పటికీ, ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లే బస్సులను మాత్రమే నిలిపివేయడం అన్యాయమని విమర్శించారు.ఈ విషయంపై నర్సీపట్నం డిపో మేనేజర్‌ను సంప్రదించినప్పటికీ స్పందించలేదని రామారావు తెలిపారు. ఇలాంటి ఘటనలు మరలా పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, లేదంటే ప్రయాణికులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

## ప్రజాసైన్స్ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలి



**రాజమహేంద్రవరం పెన్ పవర్ మార్చి 31:** జన విజ్ఞాన వేదిక , ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం అక్షర దీక్ష ఆచార్యులు సంస్మరణ సభ సందర్భంగా "వర్తమాన సమాజంలో శాస్త్రీయ అవగాహన" అనే అంశంపై సెమినార్ జరిగింది. ప్రధాన వక్తగా హాజరైన జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యులు మాజీ పార్లమెంట్ సభ్యులు మిడియం. బాబురావు మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో శాస్త్రీయ ప్రాముఖ్యతను వివరించారు. కుల మత ప్రాంతాలక తీతంగా మానవ సమానత్వాన్ని బోధించేది సైన్స్ మాత్రమేనని తెలియజేశారు .సైన్స్ విషయ పరిశీలన, ప్రయోగాలు చేయడం, ఫలితాలను విశ్లేషించడం, సిద్ధాంత ప్రతిపాదన చేయడం నిరూపిస్తుందని తెలియజేశారు. ప్రజలందరూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిం చుకుంటూ ప్రజాసైన్స్ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అక్షర దీక్ష ఆచార్యులు గోదావరి జిల్లా లలో అక్షరాస్యత కోసం చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు కే భీమయ్య ,ఎన్ రవిబాబు, యుటిఎఫ్ సహ అధ్యక్షురాలు ఎం విజయ గౌరీ ,రూపస్ రావు శ్రీమణి అనిత రాజేశ్వరి, జీ తాతారావు, రంగవల్లి, శ్రీరాములు, శ్రీదేవి గోపాల్ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# 2025-26 ఆర్థిక సంవత్సరంలో గోకవరం ఎల్ఐసి బ్రాంచ్ విజయ ప్రస్థానం.

- ఆల్ ఇండియాలో ఐదవ స్థానం లిసౌత్ సెంట్రల్ జోన్లో ఏడవ స్థానం రాజమండ్రి ఎల్ఐసి డివిజన్ లో ప్రథమ స్థానం





**గోకవరం పెన్ పవర్ మార్చి 31:--** భారతీయ జీవిత బీమా సంస్థ గోకవరం బ్రాంచ్ చరిత్రలో సువర్ణాక్షరాల తో లిఖించదగ్గ రోజు అని బ్రాంచ్ మేనేజర్ మేనేజర్ డీ. సూర్యనారాయణ అన్నారు. మార్చి 30వ తేదీ నాటికే గోకవరం బ్రాంచ్ బడ్జెట్ లక్ష్యాన్ని పూర్తి చేయడంతో మంగళవారం గోకవరం బ్రాంచ్ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ మేనేజర్ డీ. సూర్యనారాయణ ఆధ్వర్యంలో డెవలప్మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు సిబ్బంది విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. బ్రాంచి కార్యాలయం ఆవరణలో భారీ కేక్ ని కట్ చేసి అభినందనలు తెలుపుకున్నారు. వ్యాపార అభివృద్ధిలో బ్రాంచి ప్రగతిక దోహదపడ్డ డెవలప్మెంట్ ఆఫీసర్లకు ఏజెంట్లను ఏజెంట్లు యూనియన్ నాయకులను బ్రాంచ్ యూనిట్ నాయకులను బ్రాంచ్ మేనేజర్ సూర్యనారాయణ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ విజయ కోటేశ్వరరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గోకవరం బ్రాంచ్ మేనేజర్ డి సూర్యనారాయణ మాట్లాడుతూ ఎల్ఐసి పాలసీల సేకరణ లో బడ్జెట్ ను సాధించి, రాజమండ్రి డివిజన్ లో మొట్టమొదటి బ్రాంచ్ గానూ, సౌత్ సెంట్రల్ జోన్ (ఆంధ్ర తెలంగాణ కర్ణాటక) జోన్ లో 7వ బ్రాంచ్ గానూ (334 బ్రాంచ్ ల్లో) ఉత్తమ స్థానం సాధించిందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 7100 పాలసీలు చేయవలసి సాధించాలని లక్ష్యం ఉండగా 30 నాటిక 7108 సాధించి లక్ష్యాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. చేశారు. మార్చి 30నాటికే గోపురం బ్రాంచ్ బడ్జెట్ లక్ష్యాన్ని అధికమించడం జరిగిందని ఆయన తెలిపారు. ఇప్పటికీ పాలసీలు సేకరించడం జరిగిందని మొదటి ప్రీమియం రూ. 19,45 కోట్లు సాధించామన్నారు. గోకవరం మరియు ఏలేశ్వరం లకు చెందిన ప్రతీ ఏజెంట్ మిత్రుడు, డెవలప్మెంట్ ఆఫీసర్లు, బ్రాంచ్ ఆఫీసర్లు,స్టాఫ్ మెంబెర్స్ యొక్క సంపూర్ణ సహకారంతో ఇంతటి ఘన విజయాన్ని సాధించమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. గోకవరం బ్రాంచ్ ఏలేశ్వరం శాటిలైట్ బ్రాంచ్ విజయ పదానికి కృషిచేసిన ప్రతీ ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు మరియు,అభినందనలు తెలిపారు.

ఈ విజయ ప్రస్థానంలో సాధించిన మరికొన్ని మరపురాని మైలురాళ్ళు బ్రాంచ్ సిబ్బంది ఏజెంట్లు సహకారాలతో అధిగమించమని అన్నారు. మార్చి 15 నాటిక ఏలేశ్వరం శాటిలైట్ బ్రాంచ్ మేనేజర్ ఎం.వి సుబ్బారెడ్డి సమర్ధ నాయకత్వంతో, ఫీల్డ్ ఫోర్స్, స్టాఫ్ మెంబెర్స్ యొక్క చక్కని సమన్వయంతో .3783 పాలసీల బడ్జెట్ సాధించి, మన రాష్ట్రంలోనే ఈ ఘనత సాధించిన మొట్టమొదటి సాటిలైట్ బ్రాంచ్ గా విజయం సాధించింది అన్నారు. అలాగే ప్రతీ నెలా ఏజెంట్స్ యాక్టివేషన్ లో గోకవరం బ్రాంచ్ రాజమండ్రి ఎల్ఐసి డివిజన్ లోనే నెంబర్ వన్ స్థానాన్ని దక్కించుకుందన్నారు. నవంబర్ 2025 ఒక్క నెలలో 81% యాక్టివేషన్ (ఏలేశ్వరం శాటిలైట్ 100%) తో ఆల్ ఇండియా రికార్డు సృష్టించి ఎల్ఐసి మేనేజింగ్ డైరెక్టర్ ప్రశంసలు అందుకోవడం జరిగింది అన్నారు.

ఆర్థిక సంవత్సరం మొదటి 3 నెలల్లోనే డివిజన్ లో .రూ.. ప్రీమియం బడ్జెట్ సాధించిన మొట్టమొదటి బ్రాంచ్ గా మరియు బడ్జెట్ సాధనలో .. లో ఆల్ ఇండియాలో 5వ స్థానం సాధించడం జరిగిందన్నారు. క్లెయిమ్స్ సెటిల్మెంట్, రీ ఇన్వెస్ట్మెంట్ లో డివిజన్ లో బ్రాంచ్ అగ్రగామిగా నిలవడం జరిగిందని సూర్యనారాయణ వివరించారు. సంబరాల్లో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ విజయ కోటేశ్వరరావు, ఏవో చంద్రశేఖర్ , ఏఏవోలు పోతురాజు దొర, మారయ్య, డెవలప్మెంట్ ఆఫీసర్లు , సిబ్బంది ఏజెంట్స్ యూనియన్ నాయకులు ఏజెంట్లు పాల్గొన్నారు

## సన్ రైజ్ ఆసుపత్రిలో అనస్థీషియా టెక్నాలజిస్ట్స్ దినోత్సవం



**కాకినాడ, పెన్ పవర్, మార్చి 31:**కాకినాడ సన్ రైజ్ ఆసుపత్రిలో అనస్థీషియా టెక్నాలజిస్ట్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ సర్జన్ డా. బొండా సూర్యరావు, దంత వైద్య నిపుణులు డా. అడ్డాల సత్యనారాయణ, అత్యవసర చికిత్స నిపుణులు డా. గోకవరపు స్వామి ఆధ్వర్యంలో అనస్థీషియా టెక్నిషియన్స్ సురేష్, లావణ్యలను సన్మానించారు. ఈ సందర్భంగా డా. బొండా సూర్యరావు మాట్లాడుతూ, "ఆపరేషన్ థియేటర్లలో రోగుల భద్రత, శస్త్రచికిత్సల విజయవంతంలో అనస్థీషియా టెక్నాలజిస్టులు కీలక పాత్ర పోషిస్తారు. వారి సేవలను గుర్తించి గౌరవించేందుకు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం" అన్నారు. అనస్థీషియా పరికరాల నిర్వహణ, శస్త్రచికిత్సకు ముందు యంత్రాల సిద్ధం, రోగుల ప్రాణ సంకేతాల పర్యవేక్షణలో వారు ముఖ్య బాధ్యతలు నిర్వర్తిస్తారని తెలిపారు. డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ, "శస్త్రచికిత్స సమయంలో రోగికి నొప్పి తెలియకుండా చూసే అనస్థీషియా టెక్నాలజిస్టులు ప్రాణరక్షకులుగా పనిచేస్తున్నారు. శస్త్రచికిత్సల విజయానికి వెనుక ఉన్న అదృశ్య శక్తులు వారే" అని కొనియాడారు. అనంతరం డా. గోకవరపు స్వామి ఆధ్వర్యంలో రోగుల భద్రత, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సన్ రైజ్ ఆసుపత్రి సిబ్బంది క్రాంతి, రేబాక, పవన్, భ్రమరాంబ,మంజు, మాధవి, రాయుడు కృప,ఝాన్సీ,సురేష్ కొల్లి తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉగాది కానుకగా జాబ్ క్యాలెండర్..





నారాలోకేష్ కటౌట్ కిపాలాభిషేకం టిడిపి నియోజకవర్గ యువత..

**కోరుకొండ,పెన్ పవర్,మార్చి 31:**ఆంధ్రప్రదేశ్ ఐటి శాఖా, విద్యాశాఖామంత్రి, టిడిపి యువనాయకులు నారాలోకేష్ గత ఎన్నికలముందు యవగళం పాదయాత్రలో యువతకు ఇచ్చిన హామీని విస్మరించకుండా తెలుగు సంవత్సరం ఉగాధిరోజున జాబ్ క్యాలెండర్ విడుదలచేయడంపై రాజానగరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువగళం యువతబూరుగుపూడిసమీపంలోఉన్నతెలుగుదేశంపార్టీకార్యాలయంలో నారా లోకేష్ కటౌట్ కి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజానగరం నియోజవర్గతెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లు కూటమి ప్రభుత్వంలో ప్రతి సంవత్సరం తెలుగు సంవత్సరం ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదలచేస్తామని ఇచ్చిన మాటకుకట్టుబడి తెలుగు సంవత్సరాది ఉగాది కానుకగా కూటమి ప్రభుత్వం ఉద్యోగ కల్పనకు శ్రీకారం చుట్టారని ఇదేమాకు అసలైనపండగ అన్నారు. అలాగే యువతకు ఉపాధి కల్పనగా ఉద్యోగాలు ఇవ్వడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. గడచిన 20 నెలల్లో ఆరు లక్షల ఇరవై ఎనిమిది వేల ఉద్యోగాలు కల్పించిన యువనాయకులు నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అలాగే వివిద కంపెనీలతో మాట్లాడియువతకుఉద్యోగ భద్రత కల్పించేదిశగా అడుగు లువేస్తున్నారన్నారు. గత యు వగళంపాదయాత్రలోనారాలోకేష్ జాబ్ క్యాలెండర్ నిఇప్పుడు అమలుచేస్తూ నిరుద్యోగ యువతకు పెద్దపీట వేయడంఆయనకు ఆజన్మాంతం ఋణపడి ఉంటామనిస్పష్టంచేసారు. ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజవర్గం తెలుగు యువత అధ్యక్షులు పలివెల లక్ష్మణ్, నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షులు చిటికెన కిరణ్ సాయి గౌడ్, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మల్ల శ్రీ లక్ష్మీనరసింహ, కాటవరం యువ నాయకులు చిట్టూరి శ్రీరామ్, ముగ్గళ్ళ యువ నాయకులు మల్లి తేజ వెంకట సురేంద్ర, మునికొడవలి యువనాయకులుయలమాటిసురేష్, ఉండేశ్వరపురం యువనాయకులు కన్నా చిన్న బాబు, శ్రీరంగపట్నం యువ నాయకులు మల్ల గౌరీ శంకర్, నరసాపురం ఎంపిటిసి సభ్యులు పీత శ్రీను, పలువురు యువత పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఏఎంసీ డైరెక్టర్ గూడెల్ల దుర్గనాగేంద్ర కు ఘన సత్కారం





గౌడ సంఘ సభ్యులు ఇతర నాయకులు

**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 31:**కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్‌గా నియమితులైన గూడెల్ల దుర్గ నాగేంద్రను మంగళవారం ఆమె స్వగృహమైన ర్యాలి గ్రామంలో గౌడ్ సంఘ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గౌడ ఈ సంఘ నాయకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై ఆమెకు పూలమాలలు వేసి దుస్సాలతో సన్మానించారు. డైరెక్టర్‌గా నియమితులవడం గ్రామానికి గర్వకారణమని, ఆమె తన పదవిలో రైతులకు, స్థానిక ప్రజలకు మేలు చేసేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా గూడెల్ల దుర్గ నాగేంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మార్కెట్ యార్డుల అభివృద్ధి, రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకోవడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షులు పెండెం వెంకన్న , వంకా రామకృష్ణ గౌడ, తీగ రెడ్డి మహేష్ గౌడ (మండపేట బీసీ సంఘం కార్యదర్శి), మార్గాన్ని శ్రీనివాస్ ర్యాలి గ్రామ కస్టర్ ఇంచార్జ్ కందుల రాంబాబు , గౌడ సంఘ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో 16.49 లక్షల ఓటర్ల నమోదు: డీఆర్వో తిప్పే నాయక్



**కాకినాడ, పెన్ పవర్,మార్చి 31:**కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా. టి. తిప్పే నాయక్ కీలక వివరాలు వెల్లడించారు. జిల్లాలో నేటి వరకు మొత్తం 16,49,181 మంది ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటరు జాబితా నిర్వహణ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, కొత్త పోలింగ్ స్టేషన్ల ప్రతిపాదనలు, ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమాలు సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని డీఆర్వో కోరారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1640 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో ఇప్పటివరకు 16,49,181 మంది ఓటర్లు నమోదయ్యారని ఆయన తెలిపారు. 2026 జనవరి 1 నుంచి మార్చి 30 వరకు ఫారం-6, 7, 8లకు సంబంధించి మొత్తం 1219 దరఖాస్తులు అందాయని, వాటిని నిర్దిష్ట గడువులోపు పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఓటర్ల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నామని,అనువుకాని కేంద్రాలను సరైన భవనాలకు మార్చే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 1640 పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో 185 కొత్త కేంద్రాలను ఏర్పాటుచేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1150 మంది ఓటర్లను పరిగణలోకి తీసుకుని ఈ ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు. త్వరలో జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రారంభం కానుందని, ఈ ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్లను తప్పనిసరిగా నియమించాలని సూచించారు. ఇందుకు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన బిఎల్ ఏ-2 ఫారమ్‌లో వివరాలు సమర్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు గదుల సాయిబాబా (టిడిపి), రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్ఆర్ సీపీ), అడబాల సత్యనారాయణ (జనసేన), చోడిశెట్టి రమేష్ బాబు (భాజపా), సబ్బారపు అప్పారావు (బిఎస్పి), పోలిశెట్టి శ్రీనివాసు (ఐఎన్సీ), కరణం ప్రసాదరావు (సీపీఎం), కె. కృష్ణమోహన్ (ఆప్) పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్ ఏవో ఎస్. రామ్మోహన్ రావు, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం. జగన్నాథం తదితరులు హాజరయ్యారు.

# తూర్పులంక పాలకవర్గానికి ఘన సత్కారం



**అల్లవరం,పెన్ పవర్,మార్చి31:**అల్లవరం మండలం తూర్పులంక గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగిస్తుండడంతో ఆ గ్రామస్తులు సర్పంచ్ కడలి గంగాచలం ఉప సర్పంచ్ కాశీ కరుణాకర్ పాలకవర్గాన్ని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు,శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు మంగళవారం ఘనంగా సత్కరించారు సర్పంచ్ గంగా చలం మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో సంతృప్తికరమైన పాత్రపోషిం చామన్నారు. గ్రామాభివృద్ధికి తోడ్పడిన గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామ కార్యదర్శి చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు గ్రామస్తులు సచివాలయ సిబ్బంది వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

# కొంత నిరాశ ఉంది.. కానీ, బీసీసీఐ తీసుకున్న నిర్ణయం సరైనదే: గంగూలీ



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్–ఆస్ట్రేలియా మధ్య జరగనున్న ప్రతిష్ఠాత్మక టెస్టు సిరీస్ (బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీ) వేదికల ఎంపికపై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చపై టీమిండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ స్పందించారు. ఈడెన్ గార్డెన్స్‌లో టెస్టు మ్యాచ్ జరగకపోవడం పట్ల బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తనకు కొంత నిరాశ ఉన్నప్పటికీ, బోర్డు తీసుకున్న నిర్ణయం సరైనదేనని ఆయన అభిప్రాయపడ్డారు."ఒక మాజీ క్రికెటర్‌గా కోల్‌కతాలో మ్యాచ్ జరగాలని నేను కోరుకుంటాను. కానీ, కేవలం సంప్రదాయ వేదికలకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న ఇతర మైదానాలకూ అవకాశం ఇవ్వడం ముఖ్యం" అని గంగూలీ అన్నారు. గువాహటి, రాంచీ వంటి నగరాల్లో టెస్టులు నిర్వహించడం వల్ల అక్కడి అభిమానులకు మేలు జరుగుతుందని, ప్రస్తుతం దేశంలోని అన్ని స్టేడియాల్లోనూ ప్రపంచ స్థాయి సదుపాయాలు ఉన్నాయని ఆయన చెప్పారు. 2001లో ఈడెన్ గార్డెన్స్‌లో ఆస్ట్రేలియాపై సాధించిన చారిత్రక విజయాన్ని గుర్తుచేసుకున్న దాదా, ఆనాటి ఆటగాళ్లంతా మళ్లీ ఒక చోట చేరాలని ప్లాన్ చేస్తున్నట్లు వెల్లడించారు. "మేమంతా ఈ నెలలోనే కలవాల్సి ఉంది. అయితే సచిన్ టెండూల్కర్ కుమారుడి (అర్జున్ టెండూల్కర్) వివాహం ఉండటంతో ఆ భేటీని వాయిదా వేశాం. త్వరలోనే ఆ వేడుక ఎప్పుడనేది ప్రకటిస్తాం" అని ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తన కెరీర్‌లో లార్డ్స్ బాల్కనీలో చొక్కా విప్పిన నాట్‌వెస్ట్ ట్రోఫీ విజయం కంటే.. కోల్‌కతా, అడిలైడ్, హెడింగ్లేలలో సాధించిన టెస్టు విజయాలే తనకు ఎక్కువ సంతృప్తినిస్తాయని గంగూలీ చెప్పారు. పాకిస్థాన్ తో జరిగిన టెస్టులో సెహ్వాగ్ ట్రిపుల్ సెంచరీ గురించి చెబుతూ... "300 పరుగుల దగ్గర సింగిల్ తీయమని నేను చెప్పినా వినకుండా, వీరూ సిక్స్‌తోనే దాన్ని పూర్తి చేశాడు. త్రిశతకాలు తరచూ రావు, అందుకే అప్పుడు నేను కాస్త కంగారు పడ్డాను" అని నవ్వుతూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం బీసీసీఐ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నాగ్‌పూర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్‌లు బోర్డర్–గావస్కర్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

# ధోనీ నా ఫోన్ లిఫ్ట్ చేయడు.. ఆయనకు నాకు మాటలు లేవు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ మధ్యలో చెన్నై సూపర్ కింగ్స్ కొత్త, పాత ప్లేయర్స్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక రీయూనియన్ క్యాంపెయిన్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. ఈ వేడుకలో జట్టులోని దాదాపు అందరూ స్టార్ ఆటగాళ్లు కనిపించగా, జడేజా, ధోనీ ఒకరితో ఒకరు మాట్లాడుకోకపోవడం కెమెరాలలో రికార్డు అయింది. దీంతో వీరిద్దరి మధ్య కోల్డ్ వార్ స్టార్ట్ అయిందా అనే ప్రచారం మొదలయింది. ప్రస్తుతం నెట్టింట ఈ గొడవ తెగ ట్రెండింగ్ అవుతుంది. ఈక్రమంలో ఈ వివాదంపై రవీంద్ర జడేజా మాట్లాడుతూ.. అది కేవలం టెక్నికల్ ఎర్రర్ తప్ప మనస్పర్థలు లేవని స్పష్టం చేయడంతో క్రికెట్ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

జడేజా మాట్లాడుతూ.. నేను రీయూనియన్‌కు వెళ్లే ముందే 'మహీ భాయ్'కి ఫోన్ చేసి ఎక్కడ ఉన్నారో అడుగుదామని అనుకున్నా.. కానీ ఆయన ఫోన్ స్విచాఫ్‌లో ఉండటంతో.. వేడుక జరిగే ప్రదేశంలో కూడా చాలా రద్దీగా ఉండటంతో మేమిద్దరం మాట్లాడుకునే ఛాన్స్ రాలేదన్నారు. అంతే తప్ప మా మధ్య ఎలాంటి గొడవలు లేవని నవ్వుతూ ఆన్సర్ ఇచ్చాడు. ధోనీకి ఫోన్ చేయడం కంటే అతడ్ని నేరుగా కలవడమే ఈజీ, ఎందుకంటే ఆయన ఎప్పుడు ఫోన్ వాడుతారో ఎవరికీ తెలియదని రవీంద్ర జడేజా ఫన్నీ కామెంట్స్ చేశాడు. 2022 ఐపీఎల్ సమయంలో కెప్టెన్సీ మార్పుతో జడేజా, ధోనీ మధ్య గొడవలు వచ్చాయని ప్రచారం జరిగింది. కానీ 2023 ఫైనల్‌లో జడేజా ఆఖరి బంతికి ఫోర్ కొట్టి సీఎస్కేని విజేతగా నిలిపిన తర్వాత ధోనీ అతడిని ఎత్తుకుని సెలబ్రేషన్స్ చేసుకోవడంతో ఆ వార్తలకు బ్రేక్ పడింది. ద

ఇప్పుడు మళ్లీ ఇలాంటి చిన్న చిన్న విషయాలను పెద్దవి చేయవద్దని జడేజా ఫ్యాన్స్ ని కోరాడు. ధోనీ తనకు ఎప్పుడూ గురువు, మార్గదర్శి.. అతనిపై ఉన్న గౌరవాన్ని ఎప్పటికీ తగ్గించనని జడ్డూ తేల్చి చెప్పారు. ఈ రీయూనియన్ వివాదంపై జడేజా క్లారిటీ ఇవ్వడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# పాక్ క్రికెటర్లకు కొత్త రూల్.. రాజకీయ పోస్టులు పెడితే కోటి ఫైన్!



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ నసీం షాకు ఆ దేశ క్రికెట్ బోర్డు (పీసీబీ) భారీ జరిమానా విధించింది. పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్‌పై సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్ట్ చేసినందుకు గానూ అతడికి 72,000 అమెరికన్ డాలర్లు (పాకిస్థాన్ కరెన్సీలో సుమారు రూ. 2 కోట్లు) ఫైన్ వేసింది. ఈ ఘటన నేపథ్యంలో, కేంద్ర కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్లందరికీ పీసీబీ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఇకపై రాజకీయపరమైన పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే... ఇటీవల పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026 ప్రారంభ మ్యాచ్‌కు పంజాబ్ సీఎం మరియం నవాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె, ప్రస్తుత ప్రధాని షెహబాజ్ షరీఫ్ కు కూతురు వరుస అవుతుంది. అయితే, నసీం షా సోషల్ మీడియాలో "గడాఫీ స్టేడియంలో ఆమెకు రాణికి ఇచ్చినంత గౌరవం ఎందుకు ఇస్తున్నారు?" అని వ్యంగ్యంగా పోస్ట్ చేశాడు. గల్ఫ్ యుద్ధం కారణంగా దేశంలో నెలకొన్న సంక్షోభం దృష్ట్యా ప్రభుత్వ పొదుపు చర్యల్లో భాగంగా అభిమానులను స్టేడియాల్లోకి అనుమతించని సమయంలో ఒక రాజకీయ నాయకురాలికి ఇంతటి ప్రాధాన్యత ఇవ్వడంపై ఈ పోస్ట్ దుమారం రేపింది. ఈ పోస్ట్‌ను వెంటనే తొలగించి, తన ఖాతా హ్యాక్ అయిందని నసీం షా వివరణ ఇచ్చే ప్రయత్నం చేశాడు. అయితే, ఈ వాదనను పీసీబీ అంగీకరించలేదు. ఈ నెల 27న అతడికి షోకాజ్ నోటీసు జారీ చేసి, విచారణ చేపట్టింది. క్రమశిక్షణ కమిటీ విచారణ అనంతరం సెంట్రల్ కాంట్రాక్ట్ నిబంధనలను, సోషల్ మీడియా మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లు తేల్చి రూ. 2 కోట్ల జరిమానా విధించింది. నసీం షా బేషరతుగా క్షమాపణ చెప్పినట్లు బోర్డు తెలిపింది. ఈ ఘటనకు బాధ్యుడిగా అతడి సోషల్ మీడియా సలహాదారుడిని కూడా విధుల నుంచి తొలగించి, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. ఈ నేపథ్యంలో ఆటగాళ్ల సోషల్ మీడియా వినియోగంపై పీసీబీ కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. జియో న్యూస్ కథనం ప్రకారం.. ఇకపై బోర్డు మీడియా విభాగం నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి రాజకీయపరమైన పోస్టులు పెట్టరాదని ఆటగాళ్లకు, వారి మేనేజర్లకు స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కనీసం కోటి రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించింది. రాజకీయ పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని బోర్డు స్పష్టం చేసింది.



# వారణాసి సినిమాపై ఇంట్రెస్టింగ్ అప్ డేట్!



సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా -వారణాసి- తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. చిత్రీకరణ మొదలైన నాటి నుంచి రాజమౌళి అండ్ కో ఎక్కడా గ్యాప్ తీసుకోకుండా పని చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ముందుగా ప్రకటించిన సమయానికే రిలీజ్ చేయాలని కట్టుబడి టీమ్ పని చేస్తోంది. ఈనేపథ్యంలో సినిమాకు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్ డేట్ ఒకటి వెలుగులోకి వచ్చింది. మహేష్ తన పార్ట్ షూటింగ్ ను సెప్టెంబర్ లేదా? అక్టోబర్ కల్లా పూర్తి చేస్తారని తెలిసింది. అనంతరం కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పనులు మొదలు పెట్టాలని ప్లాన్ చేసుకుంటున్నారుట. సాధారణంగా రాజమౌళి సినిమాలంటే షూటింగ్ పూర్తి చేయడానికి సమయం తీసుకుంటారు. కానీ -వారణాసి- విషయంలో మాత్రం జక్కన్న పక్కా ప్లానింగ్‌తో షూటింగ్‌ను పరుగులు పెట్టిస్తున్నారు. ఓవైపు మహేష్ పై సన్నివేశ్యాలు చిత్రీకరిస్తుండగా మరోవైపు ఇతర పాత్రలకు సంబంధించిన షూటింగ్ కూడా ఏక కాలంలో జరుగుతోంది. కీలక షూట్ లో రాజమౌళి ఉండగా , మిగతా పార్ట్ కు సంబంధించిన షూట్ లో ఆయన టీమ్ పని చేస్తోంది. హీరోపై సన్ని వేశాల చిత్రీకరణ పూర్తయిందంటే మెజార్టీ పార్ట్ షూటింగ్ మొత్తం పూర్తయినట్లే. అప్పటి నుంచి షూటింగ్ పరంగా పెద్దగా ఫోకస్ చేయాల్సిన పని తగ్గుతుంది. సెట్ లో రాజమౌళి ఉన్నా? లేకపోయినా ఆయన టీమ్ మిగతా పనుల్ని సునాయాసంగా పూర్తి చేస్తుంది. అలాగే రాజమౌళి ప్రతి సినిమాకు విజువల్ ఎఫెక్ట్స్, ఇతర సాంకేతిక విభాగాలకు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారు. అయితే -వారణాసి- విషయంలో షూటింగ్‌తో పాటు సమాంతరంగా సాంకేతిక పనులను కూడా పూర్తి చేసేలా టీమ్ ప్లాన్ చేస్తోంది. మహేష్ బాబు షూటింగ్ పూర్తి చేసిన తర్వాత సినిమాను పూర్తి స్థాయిలో ఆవిష్కరించేందుకు కావాల్సిన సమయాన్ని రాజమౌళి తెలివిగా సద్వినియోగం చేసుకుంటారు.

ఇలా చేయడం వల్ల -వారణాసి- అనుకున్న సమయానికి విడుదల కావడానికి ఎంతో దోహదపడుతుంది. ఈ చిత్రాన్ని గ్లోబల్ స్థాయిలో రిలీజ్ ప్లాన్ చేస్తోన్న సంగతి తెలిసిందే. ఏకంగా 120 దేశాల్లో రిలీజ్ చేస్తున్నారు. ఒకేసారి ఇన్ని దేశాల్లో రిలీజ్ చేయడం అన్నది చిన్న టాస్క్ కాదు. రిలీజ్ కు సంబంధించి గ్లోబల్ స్థాయిలో పెద్ద పెద్ద ఏజెన్సీలు, పంపిణీ సంస్థలతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుంది. అందుకు కూడా సమయం ఎక్కువగానే పడుతుంది. అయితే రాజమౌళి లాంటి లెజెండ్ కు అదేం పెద్ద పని కాదు. ఆస్కార్ తో అంతర్జాతీయంగా తనకున్న గుర్తింపుతో అనుకున్న గొప్పగా పాన్ వరల్డ్ లో రిలీజ్ చేస్తారు.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965